నేటినిజం నేటినిజం నేటినిజం నేటినిజం నేటినిజం నేటినిజం నేటినిజం నేటినిజం నేటినిజం నేటినిజం నేటినిజం

**నమ్మలేని నిజాలు**

పక్షుల దేశం
స్వేచ్ఛావిహార యాత్ర
కళ్లకు విందు.

కాలాతీతుడు
లిబర్టీ లాలసుడు
పేదల నేత.

కళాక్షేత్రాలు
గూబల నివాసాలు
కళకు పట్టం

వీధికుక్కలు
ఆకలి అరపులు
కుక్కల షెల్టర్.

హరిశ్చంద్రులు
సత్యకలి నాథులు
జిహ్వానృత్యాలు

- రేడియమ్
సెల్: 9291527757




# నేటి నిజం

తెలుగు దినపత్రిక

website2:www.netinijam.com ఎడిటర్: బైస దేవదాస్: సెల్:9000065433 E-mail : netinijam93@gmail.com


## ముషీరాబాద్ మెట్రో స్టేషన్ వద్ద అగ్ని ప్రమాదం.. భయంతో పరుగులు తీసిన ప్రజలు

హైదరాబాద్, జనవరి 31: ముషీరాబాద్ మెట్రో స్టేషన్ వద్ద అగ్ని ప్రమాదంచోటు చేసుకుంది. మెట్రో స్టేషన్) వద్ద గల విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌లో ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. దట్టమైన పొగలు, మంటలు రావడంతో ప్రజలు భయంతో పరుగులు తీశారు. స్థానికలు అగ్నిమాపక సిబ్బందికి సమాచారమిచ్చారు. సకాలంలో అగ్నిమాపక సిబ్బంది సంఘటన స్థలానికి చేరుకొని మంటలను ఆర్పారు. త్రుటిలో పెను ప్రమాదం తప్పడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు.


హైదరాబాద్ గురువారం 1-2-2024 NETI NIZAM Telugu Daily, RNI No.52865/93· Postal No. HQ/SD/258/2024-2026 సంపుటి :30 సంచిక:142 పేజీలు:6 వెల: రూ.1/-


## వేములవాడ చెరువు సుందరీకరణకు ప్రత్యేక నిధులు : సీఎం రేవంత్ రెడ్డి



హైదరాబాద్, జనవరి 31:వేములవాడ టెంపుల్‌కు హెచ్ఎండీఏ నుంచి రావాల్సిన రూ.20 కోట్ల నిధులు వెంటనే విడుదల చేయాలని హెచ్ఎండీఏ అధికారులను సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశించారు. అలాగే వేములవాడ లో బ్రిడ్జి నిర్మానానికి 30 కోట్ల నిధులు మంజూరు చేయాలని సీఎస్‌ను సీఎం ఆదేశించారు. వేములవాడ చెరువు సుందరీకరణకు ప్రత్యేక నిధులు ఇస్తామని హామినిచ్చారు.

త్వరలో మరో సమావేశం నిర్వహిస్తామన్న ఆయన తెలిపారు. కాగా, వేములవాడ టెంపుల్ డెవలప్ మెంట్ అథారిటీతో డా.బీఆర్ అంబేద్కర్ నూతన సచివాలయంలో సీఎం రేవంత్‌రెడ్డి అధ్యక్షతన సమీక్షసమావేశం నిర్వహించారు. ఈ సమీక్ష సమావేశానికి మంత్రి పొన్నం ప్రభాకర్, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి, సంబంధిత అధికారులు హాజరయ్యారు.

## రామ మందిరం కల నెరవేరింది: రాష్ట్రపతి ద్రౌపది ముర్ము



న్యూఢిల్లీ, జనవరి 31 పార్లమెంట్ బడ్జెట్ సమావేశాల నేపథ్యంలో ఇవాళ కొత్త పార్లమెంట్ భవనంలో రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ఉభయసభలను ఉద్దేశించి ప్రసంగించారు. అయోధ్యలో రామాలయ నిర్మాణం కోసం కొన్ని శతాబ్దాలు ఎదురుచూశామని, రామ్‌లల్లా ఇప్పుడు భవ్య మందిరంలో కొలువుదీరినట్లు ఆమె పేర్కొన్నారు. కోట్లాది దేశ ప్రజల ఆశయం నెరవేరిందన్నారు. ఆ పండుగను దేశ ప్రజలు సంబురంగా జరుపుకున్నట్లు ఆమె చెప్పారు. గత ఏడాది భారత్ ఎన్నో విజయాలను సాధించిం దన్నారు. మేకిన్ ఇండియా, ఆత్మనిర్భర్ భారత్ లాంటి స్కీమ్‌లు ఇండియాను మరింత బలోపేతం చేశాయన్నారు. అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా భారత్ చాలా వేగంగా ఎదిగిందన్నారు.

ఇటీవల ప్రపంచం రెండు భారీ యుద్ధాలను, కరోనా మహమ్మారిని చూసిందన్నారు. ప్రపంచవ్యాప్తంగా సంక్షోభ పరిస్థితి ఉన్నా.. తమ ప్రభుత్వం ద్రవ్యోల్బణాన్ని అదుపులోనే ఉంచిందన్నారు. సాధారణ భారతీయులపై ప్రభావం పడకుండా ప్రభుత్వం చర్యలు తీసుకున్నట్లు ముర్ము తెలిపారు. యువ శక్తి, మహిళా సాధికారత, రైతులు, పేద లపైనే భారత అభివృద్ధి ఆధారపడి ఉందన్నారు.

గరీబీ హటావో అన్న నినాదాన్ని చిన్నపటి నుంచి వింటున్నామని, కానీ తొలిసారి విస్తారమైన స్థాయిలో పేదరిక నిర్మూలన జరిగిందన్నారు. జమ్మూకశ్మీర్‌లో 370 ఆర్టికల్‌ను రద్దు చేయడం చరిత్రే అన్నారు. ఎన్నో దశాబ్దాలుగా పెండింగ్‌లో ఉన్న అనేక పనులను గత పదేళ్లలో జాతీయ ప్రయోజనాల కోసం పూర్తి చేశామన్నారు. జీ20 సదస్సును విజయవంతంగా నిర్వహించి, ప్రపంచదేశాల్లో ఇండియా ఐడెంటిటీని బలోపేతం చేశామన్నారు.

మన దేశం ఆసియా క్రీడల్లో భారత్ వంద పతకాలు సాధించిందన్నారు. అటల్ టన్నెల్‌ను కూడా పూర్తి చేశామన్నారు. ఇటీవల భారత్ ఎన్నో విజయాలు నమోదు చేసిందని, వేగంగా అభివృద్ధి చెందుతున్న ఆర్థిక వ్యవస్థగా ఇండియా రికార్డు క్రియేట్ చేసిందన్నారు. చంద్రుడిపై దక్షిణ ధ్రువం చేరుకున్న తొలి దేశంగా కూడా ఇండియా నిలిచిందన్నారు. కొత్తగా నిర్మించిన పార్లమెంట్ బిల్డింగ్‌లో ప్రభుత్వ పథకాలపై అర్థవంతమైన చర్చ జరుగుతుందని ఆశిస్తున్నట్లు రాష్ట్రపతి ముర్ము తెలిపారు.

## ఫిబ్రవరి 2న ఇంద్రవెల్లికి సీఎం రేవంత్.. ఏర్పాట్లను పరిశీలించిన మంత్రి సీతక్క



ఆదిలాబాద్, జనవరి 31: ఫిబ్రవరి 2న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పర్యటన నేపథ్యం లో ఇంద్రవెల్లిలో సభ ఏర్పాట్లను పంచాయతీరాజ్ శాఖ మంత్రి సీతక్క, కలెక్టర్ రాహుల్ రాజ్‌తో కలిసి బుధవారం పరిశీలించారు. అధికారులకు పలు సూచనలు చేశారు.

సీఎం సభకు త్వరగా ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు.

ఏర్పాట్లలో ఎలాంటి లోపాలు ఉండొద్దన్నారు.

కాగా, ఇంద్రవెల్లి నుంచే పార్లమెంట్ ఎన్నికల శంఖారావాన్ని రేవంత్ రెడ్డిప్రారంభించనున్నారు. గతంలో పీసీసీ అధ్యక్షుడిగా బాధ్యతలు చేపట్టగానే ఇంద్రవెల్లిలో భారీ సభ నిర్వహించిన ఆయన సీఎం అయిన తర్వాత కూడా తొలి సభను అక్కడే నిర్వహించబోతున్నారు. ఇంద్రవెల్లి అమరుల స్మారక స్మృతి వనానికి శంఖుస్థాపన చేయనున్నారు. రేవంత్ రెడ్డి ముఖ్యమంత్రి అయ్యాక తొలి సభ కావడంతో సర్వత్రా ఆసక్తి నెలకొంది.

## కుల సంఘం భవనాలను ప్రారంభించిన ఎమ్మెల్యే సంజయ్ కుమార్



జగిత్యాల, జనవరి 31: గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో సబ్బండ వర్గాల అభ్యున్నతే లక్ష్యంగా ఎన్నో రకాల అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు చేపట్టింది. అన్ని మతాలతో పాటు అన్ని కులాలకు సమూచిత గౌరవం కల్పించింది. కుల సంఘాల కోసం నిర్మించిన భవనాలు సబ్బండ వర్గాలకు ఆత్మగౌరవ ప్రతీకలుగా నిలుస్తున్నాయని జగిత్యాల ఎమ్మెల్యే డా.సంజయ్ కుమార్ అన్నారు.జగిత్యాల రూరల్ మండలం నర్సింగాపూర్ గ్రామంలో ఎస్డీఎఫ్ నిదులు రూ. 2.50 లక్షలతో విశ్వబ్రాహ్మణ సంఘం, ఎల్లమ్మ ఆలయం వద్ద సీడీపీ నిధులు రూ.6.50 లక్షలతో నిర్మించిన గౌడ సంఘం నూతన భవనాలను డాక్టర్ సంజయ్ కుమార్ ప్రారంభించారు.

ఈ కార్యక్రమంలో జెడ్పీ చైర్మన్ దావా వసంత, ఎమ్మెల్సీజీవన్ రెడ్డి, ఎంపీపీ రాజేంద్ర ప్రసాద్, సర్పంచ్ సరోజన, ఎంపీటీసీ మహేష్, ఉప సర్పంచ్ చంద్రయ్య, బీఆర్ఎస్ గ్రామ శాఖ అధ్యక్షుడు గంగారెడ్డి, నాయకులు తిరుపతి గౌడ్, మల్లేశం గౌడ్, రాజి రెడ్డి, గంగారాం, హరీశ్, మాజీ ఎంపీటీసలు కుడుకల లక్ష్మణ్, రాజ నర్సయ్య, ఏఈ రాజ మల్లయ్య, నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

## ఇద్దరు కండక్టర్లపై మహిళా ప్రయాణికురాలు దాడి.. ఖండించిన సజ్జనార్

హైదరాబాద్, జనవరి 31:హయత్‌నగర్ డిపో-1కు చెందిన ఇద్దరు కండక్టర్లపై ఓ మహిళా ప్రయాణికురాలు నానా దుర్భషలాడుతూ దాడికి పాల్పడిన ఘటనను టీఎస్ఆర్టీసీ యాజమాన్యం తీవ్రంగా ఖండిస్తోంది అని పేర్కొంటూ ఎండీ వీసీ సజ్జనార్ ట్వీట్ చేశారు. ఈ ఘటనపై రాచకొండ కమిషనరేట్ పరిధిలోని ఎల్బీనగర్ పోలీస్ స్టేషన్‌లో ఆర్టీసీ అధికారులు ఫిర్యాదు చేశారు. ఆ కేసును పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

ఇది మొదటి ట్రిప్పు అని తన దగ్గర చిల్లర లేదని కండక్టర్ విన్నవించిన ఆ మహిళా ఏమాత్రం వినకుండా దాడికి పాల్పడ్డారు. అంతేకాకుండా ఆమె అసభ్య పదజాలంతో దూషించారు. ఒకట్రెండు తన కాలితో కండక్టర్‌ను తన్నింది. తాను మర్డర్లు చేస్తా.. చంపేస్తానంటూ కండక్టర్‌ను బెదిరింపులకు గురి చేసింది.

ఆమెను నిలువరించేందుకు మరో మహిళా కండక్టర్ ప్రయత్నించినప్పటికీ, ఆమె పట్ల కూడా దురుసుగా ప్రవర్తించింది.

నిబద్ధతతో సమర్థవంతంగా విధులు నిర్వహిస్తోన్న సిబ్బందిపై ఇలాంటి ఘటనలకు పాల్పడితే ఏమాత్రం ఉపేక్షించబోమని టీఎస్ ఆర్టీసీ యాజమాన్యం స్పష్టం చేస్తోంది. టీఎస్ఆర్టీసీ సిబ్బంది విధులకు ఆటకం కలిగించే, దాడులకు దిగే వ్యక్తులపై చట్టప్రకారం చర్యలు తీసుకోవడం జరుగుతుంది. టీఎస్ఆర్టీసీ సిబ్బంది చాలా ఓపిక, సహనంతో విధులు నిర్వహిస్తున్నారు. వారికి సహకరించి క్షేమంగా గమ్యస్థానాలకు చేరుకోవాలని ప్రజలకు సంస్థ విజ్ఞప్తి చేస్తోంది.

## సీపీ సంచలన నిర్ణయం.. పంజాగుట్ట పీఎస్ సిబ్బంది బదిలీ

హైదరాబాద్, జనవరి 31:పంజాగుట్ట: హైదరాబాద్ సీపీ కొత్తకోట శ్రీనివాస్‌రెడ్డి సంచలన నిర్ణయం తీసుకున్నారు. పంజాగుట్ట పోలీస్ స్టేషన్ సిబ్బంది మొత్తాన్ని బదిలీ చేశారు. పంజాగుట్ట పోలీస్ స్టేషన్‌లోని మొత్తం సిబ్బందిని ఒకే సారి బదిలీ చేశారు. పీఎస్‌లోని మొత్తం 86 మంది సిబ్బందిని బదిలీ చేస్తూ ఉత్తర్వులు బుధవారం జారీ చేశారు. ఇన్స్‌పెక్టర్ నుంచి హోంగార్డు వరకు అందరిని ఒకే సారి బదిలీ చేయడం సంచలనంగా మారింది. తొలిసారి పీఎస్ సిబ్బంది మొత్తాన్ని సీపీ బదిలీ చేశారు. కాగా, మాజీ ఎమ్మెల్యే షకీల్ కుమారుడు వివాదంలో ఇప్పటికే పలు ఆరోపణలు వెల్లువెత్తాయి.. అలాగే ఈ పీఎస్ నుంచి కీలక సమాచారం బయటకు పొక్కడంపై సీపీ సీరియస్ అయ్యారు. మాజీ ప్రభుత్వ పెద్దలకు కీలక సమాచారం చేరవేస్తున్నారని సిబ్బందిపై సీపీ వేటు వేసినట్లు సమాచారం. వేటు పడ్డ సిబ్బందిని సిటీ ఆర్మ్‌డ్ రిజర్వ్ ప్రధాన కార్యాలయంలో రిపోర్టు చేయాలని సీపీ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. ఇదే సమయంలో హైదరాబాద్‌లోని వివిధ పీఎస్‌ల నుంచి సిబ్బందిని పంజాగుట్టకు బదిలీ చేస్తూ ఉత్తర్వులు సైతం వెలువడ్డాయి.

## ఆధ్యాత్మిక భావవ్యాప్తి కోసమే ధార్మిక సదస్సు : టీటీడీ చైర్మన్ భూమన కరుణాకరరెడ్డి



తిరుపతి, జనవరి 31: భక్తుల్లో ఆధ్యాత్మిక భావవ్యాప్తి కోసం తిరుమల ఆస్థానమండపంలో ఫిబ్రవరి 3 నుంచి 5వ తేదీ వరకు ధార్మిక సదస్సు నిర్వహిస్తున్నామని టీటీడీ ధర్మకర్తల మండలి అధ్యక్షులు భూమన కరుణాకరరెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా ధార్మిక సదస్సు ఏర్పాట్లను బుధవారం ఆయన పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ హిందూ ధర్మప్రచార పరిషత్ ఆధ్వర్యంలో మరింతగా హైందవ ధర్మాన్ని, శ్రీవారి వైభవాన్ని వ్యాప్తి చేసేందుకు ధార్మిక సదస్సు ఎంతగానో ఉపయోగ పడుతుదని అన్నారు. అదే విధంగా మతాంతీకరణకు అడ్డుకట్ట వేసేందుకు, చిన్నవయసు నుంచే పిల్లల్లో మానవతా విలువలను పెంచేందుకు టీటీడీ(ఐఅ) అనేక చర్యలు చేపడుతోందన్నారు. ఇందులో భాగంగా ధార్మిక సదస్సు నిర్వహించి పీఠాధిపతులు, మఠాధిపతుల సూచనలు స్వీకరించి మరింతగా ధర్మప్రచార కార్యక్రమాలు నిర్వహిస్తామని వివరించారు.

ఇప్పటివరకు 57 మంది పీఠాధిపతులు సదస్సుకు విచ్చేసేందుకు సమ్మతిని తెలియజేశారని ఆయన వెల్లడించారు. శ్రీవారి ఆలయం నుండి ఏ సందేశం వెళ్లినా భక్తులందరూ ఆమోదించి ఆచరిస్తారని ఛైర్మన్ తెలిపారు. చైర్మన్ వెంట జెఈవో సదా భార్గవి, ఎస్వీబీసీ సీఈవో షణ్ముఖ్ కుమార్, ఎస్వీ వేద వర్సిటీ ఉపకులపతి ఆచార్య రాణి సదాశివమూర్తి తదితరులు పాల్గొన్నారు.

## బ్యాంకు వద్ద అనుమానాస్పదంగా కార్లు.. రూ.2.64 కోట్ల నగదు స్వాధీనం



రాయ్‌పూర్, జనవరి 31: ఒక బ్యాంకు వద్ద అనుమానాస్పదంగా రెండు కార్లు నిలిచి ఉన్నాయి. సమాచారం అందుకున్న పోలీసులు ఆ కార్లను తనిఖీ చేశారు. ఒక కారులో రూ.2.64 కోట్ల నగదు ఉండటం చూసి షాకయ్యారు. ఆ డబ్బును స్వాధీనం చేసుకున్నారు. ఛత్తీస్‌గఢ్ లోని దుర్గ్ జిల్లాలో ఈ సంఘటన జరిగింది. బుధవారం తెల్లవారు జామున సెక్టార్-1 ప్రాంతంలోని ఓ బ్యాంకు వద్ద రెండు కార్లు అనుమానా స్పదంగా పార్క్ చేసి ఉన్నట్లు పోలీసు లకు సమాచారం అందింది. దీంతో భిలాయ్ భట్టి పోలీస్ స్టేషన్ సిబ్బంది, యాంటీ క్రైమ్, సైబర్ విభాగానికి చెందిన పోలీసులు ఆ ప్రాంతానికి చేరుకున్నారు. రెండు కార్లను తనిఖీ చేశారు. ఒక కారులో రూ.2.64 కోట్ల నగదు ఉండటాన్ని గమనించి స్వాధీనం చేసుకున్నారు.కాగా, రెండు కార్లకు సంబంధించిన ముగ్గురు వ్యక్తులను ఈ డబ్బు గురించి పోలీసులు ఆరా తీశారు.

## కూలీల ట్రాక్టర్ బోల్తా.. ఆరుగురికి గాయాలు

వరంగల్, జనవరి 31:కూలీల ట్రాక్టర్ బోల్తా పడి ఆరుగురికి గాయాలైన ఘటన ములుగు జిల్లా పాత్రపురం గ్రామ శివారులో చోటుచేసుకుంది. ప్రతి ఏడాది ఈ ప్రాంతంలో పండే ప్రధాన వాణిజ్య పంటైన మిర్చి కోతలకు ఛత్తీస్ ఘడ్ నుండి ఆదివాసీలు పెద్ద ఎత్తున వస్తారు.

ఈ నేపథ్యంలో కూలీలు కట్టెల కోసం అటవి వెళ్లిన ట్రాక్టర్ పల్టీ కొట్టడంతో ఆరుగురు ఛత్తీస్‌ఘడ్ కూలీలకు తీవ్రగాయాలయ్యాయి. వారిని చికిత్స నిమిత్తం 108అంబులెన్స్‌లో వెంకటాపురం ప్రధాన వైద్య శాలకు తరలించారు.

## మూల మలుపుల వద్ద రేడియం స్టిక్కర్స్- ప్రభుత్వ విఫ్ బీర్ల ఐలయ్య

నల్గొండ, జనవరి 31:ప్రమాదాల నివారణకు చర్యలు చేపట్టాలని ప్రభుత్వ విఫ్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య అన్నారు. యాదాద్రి భువనగిరి జిల్లా తుర్కపల్లి మండలం ముల్కలపల్లి-సంగ్య తండా మధ్యలోని కెనాల్ వద్ద ఉన్న ప్రమాదకరమైన మూలమలుపులను పరిశీలించారు. అధికారులతో మాట్లాడి తాత్కాలికంగా ప్రమాదం జరగకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. వెంటనే అధికారులు మూల మలుపు వద్ద వైట్ స్పీడ్ బ్రేకర్స్,భారీ గేట్స్,రేడియం స్టికర్స్ ఏర్పాటు చేశారు. దీంతో ప్రమాదాలు నివారించవచ్చని చర్యలు చేపట్టారు. ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య స్పందించి వెంటనే చర్యలు చేపట్టినందుకు గాను స్థానికులు హర్షం వ్యక్తం చేసారు.

## నేడు కెసిఆర్ ఎమ్మెల్యేగా ప్రమాణ స్వీకారం.. బిఆర్ఎస్ ఎమ్మెల్యేలకు ఆహ్వానం

హైదరాబాద్, జనవరి 31:బీఆర్ఎస్ అధినేత కల్వకుంట్ల చంద్రశేఖర్ రావు గురువారం మధ్యాహ్నం శాసనసభకు వెళ్లనున్నారు.. ముందుగా ఆయన ప్రతిపక్ష నేత ఛాంబర్‌లో పూజలు చేయనున్నారు. అనంతరం సభాపతి గడ్డం ప్రసాద్ సమక్షంలో కేసీఆర్ గజ్వేల్ ఎమ్మెల్యేగా ప్రమాణం చేయనున్నారు.

ఈ ప్రమాణ స్వీకార కార్యక్రమానికి రావలసిందిగా బీఆర్ఎస్ ఎమ్మెల్యేలందరినీ కెసిఆర్ ఆహ్వానించారు. కాగా, తుంటికి ఆపరేషన్ కావడంతో డాక్టర్ల సూచన మేరకు కేసీఆర్ గత కొంతకాలంగా విశ్రాంతి తీసుకుంటున్నారు. ఇటీవల కర్ర సాయంతో నడవగలుగుతున్నారు.

## జ్ఞానవాపిలో పూజలకు అనుమతి -వారణాసి కోర్టు సంచలన తీర్పు

న్యూఢిల్లీ, జనవరి 31జ్ఞానవాపి మసీదు కేసులో వారణాసి కోర్టు కీలక తీర్పు ఇచ్చింది. మసీదులో సీజ్ చేసి ఉంచిన 10 సెల్లార్లలో ఉన్న దేవతల ప్రతిమలకు పూజలు చేసుకునేందుకు హిందువులకు, హిందుసంఘాలకు కోర్టు అనుమతి ఇచ్చింది. ఇందుకు గాను వారం రోజుల్లో అన్ని ఏర్పాట్లు చేయాలని వారణాసి కోర్టు ఆదేశించింది. కాగా ఈ తీర్పుపై హిందూ పిటిషనర్ల న్యాయవాది స్పందించారు. కోర్టు తీర్పు వారు కీలక మలుపుగా అభివర్ణించారు. . దేవతలకు పూజలు చేసే హక్కు ప్రతి హిందువుకు ఉందని ఈ తీర్పుతో తేటతెల్లమైందన్నారు..

కాగా, ఈ మసీదు హిందూ దేవాలయంపై కట్టారని.. ఇప్పటికే అందులో దేవాలయం ఆనవాళ్లు ఉన్నాయని కొందరు కోర్టును ఆశ్రయించారు. దీంతో విచారణ చేపట్టిన కోర్టు మసీదు ప్రాంగణంలో ఆర్కియాలజికల్ సర్వే ఆఫ్ ఇండియాతో "శాస్త్రీయ పరిశోధన" ఆదేశించింది. దీంతో సర్వే చేపట్టిన ఆ సంస్థ మసీదును దేశాలయంపైనే కట్టారని.. దీనికి తగు ఆనవాళ్లు లభ్యమైనట్లు కోర్టు దృష్టికి తెచ్చారు.. అలాగే కొన్నిదేవతా విగ్రహాలు, శిలా శాసనాలు ఇక్కడ లభ్యమయ్యాయంటూ వీడియోలను ఫోటోలను కోర్టుకు సమర్పించిది. ఈ సర్వే ఆధారంగా చేసుకొని వారణాసి కోర్టు ఈ రోజు కీలక తీర్పును ప్రకటించింది.

## అభివృద్ధి పనులను ప్రారంభించిన ఎమ్మెల్యే భూపతిరెడ్డి



నిజామాబాద్, జనవరి 31:నిజామాబాద్ రూరల్ మండలంలోని శ్రీనగర్, శాస్త్రీ నగర్, మల్కాపూర్ ఏ గ్రామంలో అభివృద్ధి పనులను రూరల్ ఎమ్మెల్యే డా.భూపతి రెడ్డి ప్రారంభించారు. అలాగే అనంత పద్మనాభస్వామి ఆలయంలో ఎమ్మెల్యే ప్రత్యేక పూజలు నిర్వహించారు.

**నేటి కందం- నేటికి అందం**

ఒక దేశ మ్మొక లక్ష్య
మ్మొక పద్ధతి యనుచు సతత మున్నతరీతిన్
సకలజనుల వృద్ధి కొరకు
ప్రకటించెడి బడ్జెటునకు ప్రస్తుతు లిడెదన్

(కేంద్ర బడ్జెట్ ప్రవేశపెట్టబడే రోజు)



-రాధశ్రీ
సెల్:9494481210

నేటి నిజం
# సాహితీ కెరటాలు
website:www.netinijam.com
website: www.netinijam.com
2 హైదరాబాద్ ఎడిటర్: బైస దేవదాస్: సెల్:9000065433 గురువారం 1-2-2024



నానీ

నదిలో
పడవ ప్రయాణం!
మదిలో అలలకి
రూపమొచ్చింది.



-డా॥ సి. భవానీదేవి
9866847000

ఘంటారావం

సత్యాలకు
పాతర
అసత్యాల
జాతర.

కుదింపును
కొనసాగనివ్వకు
తెగింపుకు
తెరువు వేయకు.

కోపించే మాటలకు
కంపించిపోకు
ఉరిమాక కురిసే
మబ్బులని మరువకు

వ్యక్తిగత జీవితంలో
వత్తిడిని వారించు
వృత్తిగత జీవితంలో
ఉన్నతిని వరించు



-గంటా మనోహర్‌రెడ్డి
సెల్:9949992964

## తెలంగాణ సారస్వత పరిషత్తులో
# ధర్మనిధి సాహిత్య పురస్కారాల ప్రదానం




పురస్కార గ్రహీతలతో అతిథులు ఆచార్య ఎల్లూరి శివారెడ్డి, ఎం. రామచంద్రరావు, డా॥ జె. చెన్నయ్య తదితరులు

80 ఏళ్ల చరిత్రలో భాష, సాహిత్య వికాస సేవయే పరమావధిగా సారస్వత పరిషత్తు కృషిని కొనసాగిస్తున్నదని పరిషత్తు అధ్యక్షుడు ఆచార్య ఎల్లూరి శివారెడ్డి అన్నారు. మంగళవారం పరిషత్‌లో డా॥ దేవులపల్లి రామానుజారావు కళా మందిరంలో జరిగిన ధర్మనిధి సాహిత్య పురస్కార ప్రదానోత్సవంలో ఆయన అధ్యక్షోపన్యాసం చేస్తూ సాహిత్య సేవలో దశాబ్దాలుగా కృషిని కొనసాగిస్తున్న సాహితీమూర్తులను సముచిత రీతిలో సత్కరిస్తూనే మరోవైపు ఈ తరానికి సృజనాత్మక సాహిత్య అధ్యయన శిబిరాలు నిర్వహిస్తూ రచనా నైపుణ్యాలు పెంపొందిస్తున్నట్లు తెలిపారు. శాసన మండలి పూర్వ సభ్యుడు ఎం. రామచంద్రరావు విశిష్ట అతిథిగా పాల్గొని ప్రసంగించారు. పరిషత్తు నిర్వహిస్తున్న పురస్కారాలు కవి, రచయితలకు ప్రోత్సాహం కలిగిస్తాయని తెలిపారు. పరిషత్తు ప్రధాన కార్యదర్శి డా॥ జె. చెన్నయ్య స్వాగతోపన్యాసం చేస్తూ ఇటీవల నిర్వహించిన బాల సాహిత్య సమ్మేళనం, యువ రచయిత్రుల సమ్మేళనానికి విశేషమైన స్పందన లభించిందని తెలిపారు.

బూర్గుల రంగనాథ రావు పురస్కారాన్ని **కోటం చంద్రశేఖర్**కు, పద్మభూషణ్ డాక్టర్ కె. అంజిరెడ్డి పురస్కారాన్ని **చంద్రశేఖర్ ఆజాద్**కు, డాక్టర్ తిరుమల శ్రీనివాసా చార్య పురస్కారాన్ని **ఎం.నారాయణ శర్మ**కు, తిరుమల స్వరాజ్యలక్ష్మి పురస్కారం శ్రీమతి **సమ్మెట ఉమాదేవి**కి, ఆచార్య మడుపు కులశేఖర పురస్కారం **దాస్యం సేనాధిపతి**కి డా॥బి. యన్. శాస్త్రి పురస్కారం **శ్రీరామోజు హరగోపాల్**కు, నారవరాజు రాఘవనీత పురస్కారం **డా॥ అనంతలక్ష్మి**కి, డా॥బేజవాడ గోపాలరెడ్డి పురస్కారం **డా॥ బెల్లి యాదయ్య**లకు పురస్కారాలను ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో కార్యవర్గ సభ్యుడు రింగు రామ్మూర్తి తదితరులు పాల్గొన్నారు.

# మంచి పనులకు హృదయం స్వచ్ఛంగా వుండాలి

**-ప్రముఖ సంపాదకుడు రామ చంద్ర మూర్తి**

డబ్బు ఎంతో మంది వద్ద వుండవచ్చు కానీ ఇతరులకు సహాయ పడేందుకు మంచి పనులకు హృదయంలో స్వచ్ఛత ఉండాలనీ ప్రముఖ సంపాదకుడు కె.రామచంద్ర మూర్తి అన్నారు. శ్రీ త్యాగరాయ గానసభలోని కళా సుబ్బారావు కళా వేదికపై కళా నిలయం సాంస్కృతిక సంస్థ శ్రీ త్యాగరాయ గాన సభను శ్రీ త్యాగరాయ గాన సభలోని కళా సుబ్బారావు కళా వేదికపై విద్యార్థి నాయకుడు తెలంగాణ అభిమాని ఫణి భార్గవ్ యాదిలో పేరిట జయంతి వేడుకలు జరిగాయి ముఖ్య అతిథిగా రామచంద్ర మూర్తి పాల్గొని నగదు పురస్కారం లు ప్రముఖ జర్నలిస్ట్ పి. ఆంజనేయులుకు హేమలతకు, ఆర్థిక సహకారం ఇటీవల మరణించిన సీనియర్ జర్నలిస్ట్ నర్సింగ్ రావు కుటుంబానికి విద్యార్థిని సాదియా బేగంకు ఆత్మీయ సత్కారం నేత్ర వైద్యులు డా॥ వి.లతకు అందించి మాట్లాడారు. కుమారుడు మరణించిన బాధను ఆయన పేరిట పురస్కారాలు అందిస్తూ శాశ్వతంగా ఫణి నీ యాదిలో నిలుపుతున్నారనీ అన్నారు ఎందరో ప్రముఖ వ్యక్తులు మరణించిన తరువాత వారి పేరిట వారి గురించి ఆలోచించి సమయం కూడా లేకున్న పరిస్థితులలో ఇట్టి కార్యక్రమం జరగటం ఆదర్శవంతం గా వుందన్నారు.

సాహితీ వేత్త డాక్టర్ ఏనుగు నరసింహా రెడ్డి మాట్లాడుతూ ఫణి భార్గవ్ విద్యార్థి నాయకుడు గా ఎంతో ఎదిగారని ఆయన ఉజ్వల భవిష్యత్ అర్ధాంతరంగా ముగియటం బాధాకరం అన్నారు. బాల భవన్ విశ్రాంత సంచాలకుడు డాక్టర్ ఎం.కె.రాము అధ్యక్షత వహించిన సభలో గాన సభ అధ్యక్షుడు కళా జనార్ధన మూర్తి, నేటి నిజం సంపాదకుడు బైస దేవదాసు పాల్గొని ఫణి భార్గవ్ జీవిత విశేషాలు ప్రశంసించారు. కార్యక్రమానికి తొలుత నాట్య గురువులు తులసి, సుష్మ ఉదయ మహంతి శిష్య బృందం చేసిన శాస్త్రీయ నృత్యాలు, వేమూరి మంజుల లలిత గీతాలు ఆకట్టుకున్నాయి.






ఎబియన్ సీనియర్ కరస్పాండెట్ కుమారి హేమలతకు,'సాక్షి' సీనియర్ జర్నలిస్టు పగిడిపాల ఆంజనేయులుకు నగదు పురస్కారం అందజేస్తున్న ప్రముఖ సంపాదకుడు కె. రామచంద్రమూర్తి, డా॥ఎం.కె.రాము తదితరులు.

## సునందామృతం

### గ్రామ దూర న్యాయము

గ్రామము అంటే పల్లె లేదా ఊరు.

ఒక ఊరికి మరొక ఊరికి మధ్య దూరాన్ని చెప్పడమే గ్రామ దూరం.

కొలతలతోనో, కిలోమీటర్లలోనో చూస్తే 'ఆ ఊరికి ఈ ఊరు ఎంత దూరంలో ఉంటుందో,ఈ ఊరికి ఆ ఊరు అంతే దూరంలో ఉంటుంది.' మరి అందులో ప్రత్యేకత ఏముంది అనిపిస్తుంది కదా!

కానీ దీనినే వ్యక్తుల మధ్య ఇచ్చిపుచ్చుకునే వైఖరి, ప్రవర్తన, మర్యాద మన్ననకు సంబంధించిన న్యాయంగా వర్తింప చేయడం జరిగింది.

మన ప్రవర్తన బట్టే ఎదుటి వారి ప్రవర్తన ఉంటుందని చెప్పడమే ఈ న్యాయం యొక్క ప్రధాన ఉద్దేశ్యం.

కొందరు వ్యక్తులు తాము చాలా గొప్ప వాళ్ళుగా, ప్రత్యేకమైన వ్యక్తులుగా భావిస్తూ ఉంటారు. తాము వెళ్ళిన చోట తమ ప్రత్యేకతకు దక్కాల్సిన గౌరవం, గుర్తింపు దక్కలేదని బాధ పడుతూ ఉంటారు.కానీ అలాంటి సందర్భాల్లో తాము ఇతరుల పట్ల ఏ విధంగా ప్రవర్తించారో గుర్తుంచుకోరు.

తమ ప్రవర్తన, గౌరవించే తీరును బట్టే ఎదుటి వారి ప్రవర్తన, గౌరవం ఉంటాయని అర్థం చేసుకోని వారికి వేసే చురకే ఈ న్యాయము.

నేడు తల్లిదండ్రులు,పిల్లల మధ్య ఉన్న బంధాలు, అనుబంధాలు కూడా ఇలాగే ఉండటం బాధాకరం.

కొంత మంది తల్లిదండ్రులు తమ పిల్లలు పెద్ద పెద్ద చదువులు చదివి, బాగా సంపాదించాలనే కోరికతో చిన్నప్పటి నుండే వాళ్ళను తమకు దూరంగా ఎక్కడో ఉన్న పాఠశాలల్లో చేర్పిస్తున్నారు.ఆ పసి వయసులో వారికి తల్లిదండ్రుల నుండి అందవలసిన ప్రేమ, ఆప్యాయతా అనురాగాలు, కుటుంబ పరమైన సంస్కృతి, విలువలు సరిగా అందడం లేదన్నది వాస్తవం.అక్షర సత్యం .

తాము అనుకున్న విధంగా పిల్లలు ఉద్యోగాలైతే సాధిస్తున్నారు కాని వాళ్ళ దగ్గర శేష జీవితాన్ని గడపాలనుకుంటే మాత్రం నిరాశే మిగులుతోంది.తాము చిన్నప్పుడు వాళ్ళను దూరంగా ఎలా ఉంచారో అలాగే తల్లిదండ్రులను కూడా పిల్లలు అలాగే దూరంగా ఉంచుతున్నారు.

కారణం అర్థమవుతుంది కదా! దీన్ని ఒక విధంగా గ్రామ దూర న్యాయమనీ, ఇచ్చి పుచ్చుకోవడమనే ఆదాన ప్రదానాలకు చెందినదని తెలుసుకోవాలి.

మనిషి జీవితమే ఇచ్చి పుచ్చుకోవడంతో ముడిపడి ఉంది.ఇందులో ప్రేమ గౌరవం,దయ,దానం, సహకారం లాంటివి ఎన్నో ఉంటాయి. ఎదుటివారికి ఇవన్నీ మనస్ఫూర్తిగా ఇవ్వగలిగితే ఇతరుల నుండి కూడా వాటిని పొందే అవకాశం ఉంటుంది.

ఇలా ఈ గ్రామ దూర న్యాయాన్ని మన నిత్య జీవితంలోని అనేక విషయాలకు అన్వయించుకోవచ్చు, ఉదాహరణగా చెప్పుకోవచ్చు.



**-పురిమళ్ల సునంద**
*9441815722*

## నిర్వచనం

కాలం
ఎప్పుడు విషాదంగా
పరిణామం చెందుతుందో తెలియదు.
దృశ్య మాయాజాలం నిండిన
లోకం ఇది.
ఆకలికీ కన్నీటికి
విలువకట్టడం
ఆకారం లేని నెత్తుటి ముద్దను
కౌగిలించుకోవడమే!
జీవించడాన్ని
మరణించడాన్ని
సమానంగా చూసే నువ్వు
నీ అంతరాత్మతో
ఎప్పుడూ ఏకీభవించలేవు.
నీ జీవితంలో
ఏ ప్రశ్నకైనా
సంతోషకర సమాధానం ఉందా!
దేశం కోసం చేసిన త్యాగాలన్నీ
ఆఖరి పేజీల్లో సంభాషిస్తుంటాయి.
దేన్నైనా అనుభవించడం సులభమే!
నిర్వచించడమే కష్టం.



**-ఏటూరి నాగేంద్రరావు**
7416665323

## భావాగ్ని వేమన్న...

జన సామాన్యం బ్రతుకులోంచి
పద్యమై ప్రభవించిన ప్రజాకవి
సామాజిక చైతన్య వారధి
పేరుకుపోయిన మూఢ విశ్వాసాలపై
ఆయనే ఒక
తిరుగులేని తిరుగుబాటు బావుటా
హేతువాది
అభ్యుదయశీలి
చైతన్య శంఖారావమై
జడతలోని లోకాన్ని మేల్కొల్పిన
విప్లవ వైతాళికుడు
వేమన్న కురిపించిన భావాగ్ని
మనిషి వికాసానికి దిక్సూచి



**-డా. తిరునగరి శ్రీనివాస్**
8466053933

## కొత్త డిఎన్ఏ !

మనిషిని కర్రతో కొట్టినా
ఆయుధంతో కొట్టినా
ఆడదానితో కొట్టినా
అధికారంతో కొట్టినా
బంధుత్వంతో కొట్టినా
విషప్రయోగంతో కొట్టినా
వస్తువాహనంతో కొట్టినా
ప్రేమాభిమానంతో కొట్టినా
క్రింద పడకపోవచ్చు గాని ?
ఏదైనా ఒకసంఖ్య పక్కన
కేవలం సున్నాను జోడిస్తూ
డబ్బుతో కొడితే మాత్రం
పడని జాతింకా పుట్టలేదు.
అన్నీకోల్పోతూ మనీకై బ్రతికే
మానవజాతి కొత్త డిఎన్ఏ అదే !



**-డా॥ డి. రాజేశ్**
9440460490

# మల్లీశ్వరికి 'తెలుగు గజల్ వాగ్గేయకారిణి' బిరుదు

ప్రపంచ రికార్డులను పొంది గజల్ చరిత్రలో నూతన అధ్యాయానికి నాంది పలికిన రాజా వాసిరెడ్డి మల్లీశ్వరికి "తెలుగు గజల్ వాగ్గేయకారిణి" బిరుదు ప్రదానం చేశారు. ఆదివారం రవీంద్రభారతి సమావేశ మందిరంలో తెలంగాణ భాషా సాంస్కృతిక శాఖ, రాజా వాసిరెడ్డి ఫౌండేషన్, జి.కె. టాకీస్ ఆధ్వర్యంలో జరిగిన **'మోహన మహోత్సవం"**లో "సాహిత్య తరంగిణి రచయితల సంఘం" వ్యవస్థాపకులు ప్రముఖ గజల్ కవి, రచయిత సూరారం శంకర్ మల్లీశ్వరికి "తెలుగు గజల్ వాగ్గేయ కారిణి" బిరుదుతో సత్కరించారు.



రాజావాసిరెడ్డి మల్లీశ్వరికి "తెలుగు గజల్ వాగ్గేయకారిణి" బిరుదు ప్రదానం చేస్తున్న అతిథులు.

సభకు అధ్యక్షత వహించిన సీనియర్ జర్నలిస్టు బైస దేవదాసు మాట్లాడుతూ.. మానవతా విలువలతో గొప్ప హృదయమున్న వాళ్ళే గజళ్ళు గొప్పగా రాయగలుగుతారని అన్నారు. అనతికాలంలోనే మూడు వందలకు పైగా గజళ్ళు రాయడంతో పాటు గానం చేస్తు తన ప్రతిభను చాటుకుంటు పలు అవార్డులు అందుకున్న రాజా వాసిరెడ్డి మల్లీశ్వరిని అభినందించారు.

శ్రీ కృష్ణ దువ్వూరి రూపొందించిన మల్లీశ్వరి గానం చేసిన గజల్స్ దృశ్యరూపాన్ని ప్రదర్శించడం సభలో వున్న వారందర్ని ఆనందపరిచిందని దువ్వూరి కృషిని అభినందించారు.



"మోహన గజల్స్‌పై స్పందనలు" పుస్తకాన్ని ఆవిష్కరించిన డా॥ వి.డి. రాజగోపాల్



"మోహన" పుస్తకాన్ని ఆవిష్కరించిన డా॥బిక్కి కృష్ణ.

డా॥ బిక్కికృష్ణ మాట్లాడుతూ.. సాహిత్యంలో విశేష కృషి చేస్తూ గజల్స్ పది సంపుటాలను వెలువరించి పాఠకుల మన్ననలను పొందుతున్న రాజావాసిరెడ్డి మల్లీశ్వరిని కొనియాడారు. గజల్స్ రాయడంలో పట్టు సాధించారని మోహన మహోత్సవానికి గజల్స్ కవులు ఎక్కువ మంది పాల్గొనడం ఆనందంగా వుందని అన్నారు. అనంతరం **'మోహన'** పుస్తకాన్ని ఆవిష్కరించారు.

మల్లీశ్వరిగారి గజల్స్ విని ఒకింత ఆశ్చర్యం కలిగిందని తన సాహితీ పరిచయాన్ని వీడియో దృశ్యీకరణకు మల్లీశ్వరిగారు సహకరించినందులకు శ్రీకృష్ణ దువ్వూరి ధన్యవాదాలు తెలిపారు.

మైన్స్ మరియు జియాలజీ పూర్వ డైరెక్టర్, మహర్షి వాల్మీకి సాంస్కృతిక సేవా సంస్థ గౌరవ అధ్యక్షులు డా॥. వి.డి రాజగోపాల్ రూపొందించిన **"మోహన గజల్స్‌పై స్పందనలు"** పుస్తకాన్ని ఆవిష్కరించారు.

కీర్తన ఆర్ట్స్ సోషల్ కల్చరల్ ఆర్గనైజేషన్ వ్యవస్థాపకులు, రచయిత్రి చేబ్రోలు శశిబాల మల్లీశ్వరి గజల్స్‌ను కొనియాడారు. మల్లీశ్వరి సాహిత్య ప్రస్థానాన్ని డా॥ రాధాకుసుమ క్లుప్తంగా వివరించారు.రాజావాసిరెడ్డి మల్లీశ్వరి మాట్లాడుతూ రాజావాసి రెడ్డి ఫౌండేషన్ యొక్క ఔన్నత్యాన్ని ప్రత్యేకతను సాహితీ సామాజిక కార్యక్రమాలను వివరించారు. ప్రపంచ రికార్డులను పొంది భారత దేశ గజల్ చరిత్రలో నూతన అధ్యాయానాకి నాంది పలికింది 'మోహన' అని 50 గజల్స్ గానం చేయబడిన తొలి గజల్ కావ్యం మో హన అని అందుకే 'మోహన మహోత్స వం' ఏర్పాటు చేశానని ఈ మహోత్స వానికి విచ్చేసి విలువైన సందేశాలిచ్చిన అతిథులకు సభకు విచ్చేసిన అందరికీ ధన్యవాదాలు తెలిపారు.సభా సమన్వయకర్త డా॥ రాధా కుసుమ నిర్వహణలో జరిగిన గజల్ కవి సమ్మేళనంలో ఎన్వీ రఘువీర్‌ప్రతాప్, షేక్ బడాజాన్ పైదా, విజయగోలి, లలితావర్మ, డా॥ యం. నాగేశ్వర రావు, హంసగీతి, తుమ్మూరి రామమోహనరావు, నోరి రఘురామ మూర్తి, సరికొంగ నరసింహరాజు, వి.డి. రాజగోపాల్‌లు పాల్గొన్నారు.

# నీతి కథల సమాహారం "రాచ ఏనుగు"

పుస్తక సమీక్ష

పిల్లలకు కథలు అంటే చాలా ఇష్టం. వారికి గోరుముద్దలు తినిపించాలంటే ఏదో ఒక కథ చెప్పాల్సిందే. బాలబాలికల్లో నైతిక ప్రవర్తనను, మంచి చెడులను పెంచే బాధ్యత ఒకప్పుడు ఉమ్మడి కుటుంబాల్లో నానమ్మ తాతయ్యలు కథలు చెప్పడం ద్వారా నెరవేరేది. కానీ నేడు ఉమ్మడి కుటుంబాలు విచ్ఛిన్నమైన తర్వాత వేర్పాటు కుటుంబాలలో పిల్లలకు కథలు చెప్పే వారు కరువయ్యారు. పిల్లలకు చక్కటి నీతితో కూడుకున్నటువంటి కథలను చెప్పే బాధ్యతను బాల సాహిత్యకారులు తమ భుజాలపై వేసుకున్నారనటంలో సందేహం లేదు .బాల సాహిత్యమే ఇప్పుడు ముందుండి పిల్లల కోసమే చక్కటి కథలు, గేయాలు ,పాటలను విరివిగా ప్రాచుర్యంలోకి తెస్తుంది.పిల్లలు కథలు అంటే చెవి కోసుకుంటారు .మరి ఆ కథల్ని పిల్లలే రాస్తే, చదవడానికి ఎలాంటి ఆటంకం ఉండదు. చిన్న చిన్న ఊహలకు మెరుగైన ఆలోచనలు తోడైతే అద్భుతమైన కథలు వస్తాయనడంలో అతిశయోక్తి లేదు.

నాయనమ్మ, బామ్మ ,అమ్మ ఏదో ఒక పిట్ట కథలు చెప్పి పిల్లలకు తినిపిస్తారు .ఆ కథలు వారికి అర్థమైతున్నయో తెలియదు. కానీ అమ్మ చెప్పే కమ్మని కథలు




**ప్రతులకు:**
మాచర్ల శిరీష
ఇంటి నెంబర్ 28 బి813
విద్యానగర్,మిర్యాలగూడ
నల్గొండ జిల్లా 508207

వింటూ కడుపు నింపుకుంటారు. ఇవన్నీ ఒకప్పుడు ఉమ్మడి కుటుంబాల్లో పెద్దలు తప్పనిసరిగా పిల్లలకు ఆసక్తి గొలుపే కథలు, గేయాలు చెప్పేవారు .ఇప్పుడు అవి లేవు . సెల్ఫోన్, యూట్యూబ్లో టీవీలో వీడియోలు చూస్తూ పొద్దు పుచ్చుతున్నారనడంలో ఇంత మాత్రమే సందేహం లేదు.

"రాచ ఏనుగు" కథల సంపుటి వెలువరించిన రచయిత్రి డాక్టర్ సిరి గారు వృత్తిరీత్యా దంత వైద్యులు .అయినా పిల్లల కోసం చక్కటి నీతితో కూడుకున్నటువంటి విజ్ఞాన వినోద , నీతి కథల పుస్తకాలు పిల్లల కోసం వెలువరించడం అభినందనీయం. వీరు రాసిన కథలు ఇతర భాషల్లోకి అనువదించబడ్డాయి. ఈ కథల సంపుటిలో ఉన్న 15 కథల లో ఒక్కొక్కటి ఒక్కొక్క ప్రత్యేకతను కలిగి ఉంది. తప్పనిసరిగా ప్రతి కథలో ఒక నీతి దాగి ఉంది. అంతే కాకుండా పాఠకులను ఆలోచింపజేసే విధంగా ఉన్నాయి .ఎప్పటికీ గుర్తుపెట్టుకునేటట్లు కథలు రాయడం గొప్ప విషయమే.

శత్రువును తక్కువ అంచనా వేయడం తెలివి తక్కువ పని .ప్రమాదం ఉందని తెలిసినప్పుడు దాన్ని ఎదుర్కొనే శక్తి మనలో ఉందో లేదో అంచనా వేసుకోవాలి అనే చక్కటి నీతి "ఇద్దరు మిత్రుల కథ"లో ఉంది. మన మంచి కోరే చెప్పే విషయాలు తప్పనిసరిగా వినకుంటే ఆపద వస్తుందనే సందేశం ఇందులో ఇమిడి ఉంది.

మరో చక్కటి కథ" సాయం". ఎప్పుడైనా ఎవరికైన సహాయం చేయాలంటే , మనం ఎవరికి సహాయం చేస్తున్నామో ఆలోచిం చుకోవాలి. చెడ్డవారికి సాయం చేస్తే కష్టాలకు దారితీస్తుందనే సందేశం ఈ కథలో ఇమిడి ఉంది.

ధైర్యం ఉన్నవారికి ఆయుధంతో పనిలేదు. శత్రువుని సంహరించే శక్తి ఆయుధంలో ఉండదు. దాన్ని ఉపయోగించే వారిలో ధైర్యం ,తెలివి ఉంటుందన్న చక్కటి నీతి" ఆయుధం" కథలో రచయిత్రి డాక్టర్ సిరి గారు చక్కగా ఆవిష్కరించారు. పిరికితనం చెడ్డదని ,ధైర్యం గొప్పదనే విషయం అర్థమవుతుంది.

సోమరులను ఈ భూమి మీద ఎవరు ,ఎప్పుడు ఇష్టపడరు. అలాంటి వారికి తగిన శాస్తి జరుగుతుంది. సోమరితనాన్ని వదిలించుకోవాలి లేకపోతే కుక్క గతి పడుతుందని ,మంచినీతిని "గాడిద బికుక్క కథ"లో పిల్లలు తెలుసుకుంటారు.

"ముల్లును ముల్లుతోనే తీయాలి". అలాగే మూర్ఖుడికి అతనికి అర్థం అయ్యే భాషలోనే చెప్పాలంటే సహనం కన్నా లౌక్యంకావాలి అనే చక్కటి సందేశం"భార్గవుడు "కథలో ఉంది. ఇంకా అవతారం, విశ్వనాథుడు కథ, కోడి కథ, ప్రవర్తన కనకయ్య బిపిల్లి , బాన కథల్లో కూడా చక్కటి సందేశం ,నీతిని రచయిత్రి గారు అందించారు. ఆబాల గోపాలన్ని అలరించే చక్కటి కథలు మరెన్నో వారి కలం నుండి జాలువారాలని కోరుకుందాం. వారికి శుభాకాంక్షలు. పుస్తకం ఒక చత్రం వచ్చని చెట్లతో, జంతువులతో ఆకర్షణీయంగా ఉంది. మొత్తం పేజీల సంఖ్య 80. పుస్తకం ధర120 రూపాయలు



**-యాదవరం చంద్రకాంత్ గౌడ్**
9441762105

# సమ్మక్క సారక్క వీర వనితలు



పచ్చని అడవిలో కొలువైన సమ్మక్క సారక్క
కుంకుమ బరిణే లో గద్దెకు పయనం
కోయ పూజారులతో కొలువైన చిలకలగుట్ట
తల్లికి తడి బట్టలతో తానాలతో పూనకాలు-

ధరణిలో సమ్మక్క సారక్కలు
కంక వనంలో సమ్మక్క సారక్క
మమ్ముకాపాడే సమ్మక్క సారక్క
కోయ ప్రాంతమందు సమ్మక్క సారక్క-

వీరులు శూరులు సమ్మక్క సారక్క
త్యాగాల సిరులు సమ్మక్క సారక్క
కుంకుమ భరణిలో సమ్మక్క సారక్క పూజలు
సమ్మక్క సారక్క దీవెనలతో కొంగుబంగారం-

నిలువెత్తు బంగారు బెల్లంతోమొక్కులు
అంబరమంటే సంబురం మన మేడారం
కోరిన కోరికలు తీర్చే సమ్మక్క సారక్కలు
భారతదేశం లో జరిగే అతి పెద్ద జాతరమేడారం-

మూడు రోజులపాటు
ముచ్చటగా జరిగే మేడారం జాతర
బంగారం పెట్టి బాగుండాలని కోరే భక్తులు
నలుమూలల నుండి తరలివచ్చే భక్తులు

మహిమలున్న దేవతా మూర్తి సమ్మక్క!!!

భక్తులు తల్లికి
నిలువెత్తు బంగారు పెట్టి కొలిచెదరు
జయశంకర్ జిల్లాలో
జనసాంద్ర మయే మేడారం.



**-దేవులపల్లి రమేశ్,**
9963701294

కథల వంతెన

# ఎర

కథ





-డా॥నందిని సిధారెడ్డి
సెల్:9440381148

చుట్ట ముట్టించుకొని, వాకిట్లో ఒంటరిగా కూచుని ఆకాశం వంక చూస్తూ ఆలోచిస్తున్నాడు పరంధామయ్య.

"ఏమయ్యో! ఇయ్యాల అన్నం తినవటనా? పెట్టిన, తిందువురా", పరంధామయ్య భార్య నరసమ్మ వంటింట్లోంచే కేకేసింది. భార్య కేక వచ్చిందంటే ఆపాటికే ఇద్దరు కొడుకుల భోజనాలు అయిపోయాయన్న మాట.

'ఈ బతుక్కి తినటం, బతకటం తప్పితే మరింకేదైనా పరమార్థముందా? ఛీ! వెధవబతుకు!', అని వేదాంతంలో పడి కాండ్రించి చుట్ట కొరికి ఉమ్మేశాడు పరంధామయ్య.

"ఏందయోయ్! ఈమద్దె మీకు పరధాన్నెం ఎక్కువైంది. తొందరగా రండి. నువ్వు తింటెగాని నేను దినగూడదేమో? మల్ల నాకాక లౌతు ంది," భార్య అరుగుమీదికొచ్చి సోది మొదలెట్టాక. "ఎన్ని తప్పినా ఇది తప్పదాయె," అని రాగం తీస్తూ వంటింట్లోకి నడిచాడు నరసమ్మ వెనకాలే.

అలసి వచ్చినారేమో కొడుకులిద్దరూ తనెల్లేసరికి గొంగడేసుకొని పడుకొన్నారు. బిడ్డ మాత్రం తింటుంది. పరంధామయ్య కాళ్లు కడుక్కొని వచ్చేవరకు కంచంలో వడ్డించి పెట్టింది భార్య నరసమ్మ. ముక్కాలిపీట జరుపుకుంటూ భోజనం మీద కూచున్నాడు పరంధామయ్య. అంతే! కొంపలంటుకుపోయాయి అన్నట్టు (కొంపలెన్నో కాదు,ఒక్కటే కొంప అదీ పరంధామయ్య కొంపే) ఇంట్లోకి పొగ కమ్ముకొస్తూంది. బయట కేకలు వినపడ్తున్నాయ్.

"ఇల్లంటుకొంది, ఇల్లు. ఇల్లు కాలిపోతుందిరోయ్.. రండ్రా'! అప్పుడప్పుడే కన్నంటుకొంటూన్న కొడుకులు ఆ కలకలం విని బయటకురికొచ్చారు.

ఇంకేం తమ ఇల్లే కాలిపోతుంది. ఇంటి ముందటి పందిరి భయంకరంగా మండుతోంది. ఇంటి మీద గూనల్లోంచి పొగ దట్టంగా ఆకాశంలోకి వెళ్తోంది చుట్టూ చీకటి.

> "ఛస్! నోర్మూసుకో!
> నువు గట్లే అంటవ్.
> నువ్ చల్లార్పింది, చల్లార్పంది..
> ఎవలు జూసింద్రని నమ్మాలె.
> గిట్లే బదులాయించుతరు.
> అంతా మీదే తప్పు!"

అరుపులూ? అరుపులు!

కేకలు! కేకలు! కేకలు!

"అయ్యా! అయ్యా, మన ఇల్లు కాలిపోతుందే, బయటకు వచ్చేయండ్రి". పిలుపులు వినకముందే అన్నం విడిచిపెట్టి, బిడ్డ చేయి పట్టుకొని బయటపడ్డాడు పరంధామయ్య.

నర్సమ్మ దొడ్డిదారి గుండా బయటపడ్డది.

అందరూ గుమిగూడి చూస్తున్నారు. మంటలు! మంటలు! మంటలు! మంటలు మండిపోతున్నాయి! ఇంకాసేపట్లో ఇల్లు బూడిదయేలా ఉంది.

"చూస్తే ఏం లాభంరా, నీళ్లందుకోండ్రి," పెద్దమనిషి సలహా మీద ముసలీముత్రా అందరూ బాయిలో చేద వేసి కుండలు నింపటం మొదలెట్టారు. చాతనైన యువకులు ధోతి గుడ్డను గోచిపెట్టి మంటల మీద నీళు చల్లుతున్నారు కుండల్తోటి. ఆడోళ్లు కుండలు మోస్తున్నారు.

పగిలిపోయే కుండలు పగిలిపోతున్నాయి.

ఆ హడావుడిలో కాళ్లు తట్టుకొని కొందరు పడిపోతుంటే, "మెల్లగా మెల్లగా.." అంటున్నారు కొందరు.

"ఓదిక్కు ఇల్లు కాలిపోతుంటే, మెల్లగేమిటయ్యా.. మెల్లగా.. త్వరగా కానీయండ్రి," అంది ఓ కంఠం.

అప్పటికే పరంధామయ్య ఒకటెనక ఒకటి వస్తువులు తెచ్చి బయటపడేస్తూనే ఉన్నాడు. కొడుకుల్లో పెద్దాడు నీళ్లు పోస్తున్నాడు. చిన్నోడు కుండలూ అవీ తేవటంలో తల్లికి సాయం చేస్తున్నాడు. బిడ్డ కంచం పట్టుకొని, నోట్లో బుక్క నోట్లోనే ఉండగా, బీరిపోయి చూ స్తుంది.

మంటలు చల్లారినాయి. నీళ్లకు చల్లబడి కాదు. ఇల్లునంతా బూడిద చేసినాక కోపం చల్లబడి.

"ఇంతకీ ఎలా అంటుకుందంటారు?" అని కొందరనుమానంతో ప్రశ్నిస్తే.. "ఎలాగేమిటో తెల్వలేదానయ్య! దీపం కొంచెం బాగాలేదట. అది అప్పుడప్పుడు మండుతుందట. ఆ దీపం మంట బరబరా మండుతూ కొంచెం కొంచెం పెద్దదై దూలం అంటుకొని చూరు కూడా అంటుకుందట. వాళ్ల అశ్రద్ధ వాళ్లకే ముప్పు తెచ్చిపెట్టింది," అని జవాబిచ్చింది, కాస్తో కూస్తో తెల్విగల తెల్లబట్టల గుంపు.

"ఏరా? రంగిగా, ఎలా అంటుకుందంటావ్ రా?" అని అడిగితే..

"ఏముందే పెద్దయ్యా! అదేన్నె పొద్దింజాముల పొయిల నిప్పు చల్లార్పలేదట. ఆ నిప్పు గాలికి చిన్న చిన్నగా రాజుకొని మిరుగులు ఇంటి మీద పడి మంట మండిందట. దానికి తోడు ఎండకాలమాయె! భగ్గుమని మంటలు లేశినాయట," అని రంగడు చెబుతుంటే, 'నిజమే! కాబోలు' అనుకొని సమాధానపడింది మరో మురికిబట్టల గుంపు.

చాలా రాత్రయింది.

అందరూ వెళ్లిపోయారు.

కేకలు, అరుపులూ అన్నీ మంటల్తో పాటే చల్లబడి బూడిదగా మిగిలినట్లు నిశ్శబ్దంగా ఉంది. పరంధామయ్య, మోకాళ్ల సందున తల నిరికించి నెత్తిమీద చేతులు పెట్టుకొని కూర్చున్నాడు వాకిట్లో. జ్ఞానోదయం కోసం యోగాసనం వేసిన బుద్ధ భగవానుడిలా.

కొడుకులు చెరొకచోట కూర్చున్నారు బతికున్న శవాల్లా.

అమ్మ ఒడిలో నిద్దరోతుంది ఆ ఇంటికి ఒక్కగానొక్క ఆడబిడ్డ.

'తమ బతుకులు కాలిపోయినా బాగుండేది,' అనుకొంది నరసమ్మ.

ఆకాశం తెర మీద సూర్యుడు ఫోకస్ చేయబడ్డాడు.

తొమ్మిది దాటింది.

సూర్యుడి ముఖం సీరియస్‌గా ఉంది.

ఇంకాసేపట్లో ధర్మ విచారణ.

అందరూ మూడు గుండ్ల కాడ గుమిగూడారు. ఆ ఊళ్లోని ఏ పంచాయతైనా తీర్పు జరిగేది అక్కడే. అంతా హడావుడిగా ఉందక్కడ.

పటేలు ధోతి సవరించుకుంటూ లేచి నిలబడ్డాడు. అందరూ నిశ్శబ్దంగా అయిపోయి పటేలు వంక చూస్తున్నారు.

"దీపం మండి, మెల్లమెల్లగా దూలం అంటుకొని ఇల్లు కాలిపోయిందంటున్నారంతా. దానికి మీ సమాధానమేమిటో జల్ది సెప్పాలి!" అనేశాడు పటేలు పరంధామయ్య కుటుంబం వంక చూస్తూ..

కొంగు కొస చేతిలో పట్టుకొని నిలబడ్డ నర్సమ్మ కన్నీళ్లు తుడుచుకొని మెల్లగా మొదలెట్టింది.

పటేలు కూచున్నాడు.

"పటేలా! బాంచెన్.. మా ఇంటికొక్కటే దీపం. రోజూ నేనే ముట్టిత్త. అదీ ఇదివరకెప్పుడూ మండలేదు. అయినా మా యింటికొకటే దీపం గనక నిన్నటాళ్ల మేం తిన్న దగ్గర్నే కంచాల ముందున్నది. దీపంతో నసలే మంట రాలేదు. ఎవడో గిట్టనోడు చేసుంటడీ పని," అని ఆగిపోయింది.

అంతా విన్నాక మళ్లా పటేలు లేచి, "పోయిల నిప్పు చల్లార్చక నిప్పుకలు గాలికి చెలరేగి అంటుకున్నదంటున్నారు మరికొందరు. అది మీ తప్పే కదా!" అన్నాడు.

"కాదయ్యగారూ! ఇయ్యాల నాత్రికి నేనే చల్లార్చిన పొయ్యిని. ఒక్క అగ్గి మిరుగు కూడా లేకుంట. అదంతా ఎవరో పుట్టించిన పుకార్లు. అట్ల జరగలేదు పటేలా!" అని గొల్లుమంది నరసమ్మ.

"ఛస్! నోర్మూసుకో! నువు గట్లే అంటవ్. నువ్ చల్లార్పింది, చల్లార్పందీ.. ఎవలు జూసింద్రని నమ్మాలె. గిట్లే బదులాయించుతరు. అంతా మీదే తప్పు!"

నరసమ్మ నోరు మూసుకున్నది. పరంధామయ్యకి నోరు తెరవాలని పించలేదు. పరంధామయ్య కొడుకులకీ ఏమి మాట్లాడాలో అర్థంకాక ఊరుకున్నారు.

పటేలు ఇంకా ఏదో చెబుతూనే ఉన్నాడు.

అయినా ఆ భగవంతుడే ఉన్నాడన్నిటికీ. వాడికేమీ చాటులేదుగా. పొద్దున, ఒద్దు అనంగ దేవుడి పొలందున్నింద్రు. మొన్న సర్పంచు పిలిస్తే కూడా నర్సి పనిలకెల్లలేదు.

పటేలుతో పాటే పదిమంది పెద్దలూ లేచిపోయారు. 'దేవుడి రాసింది తప్పుతదా!' అనుకుంటూ.

పరంధామయ్య కొయ్యబొమ్మలా నిలబడ్డాడు. కాసేపాగి చుట్టూ చూశాడు. అందరూ వెళ్లిపోయారు. తన కొడుకులిద్దరూ శవాల్లాగా కూలడిపోయారు. భార్య నరసమ్మ ముఖం మసిపూసినట్లు వివర్ణమై ఉంది. బిడ్డ ఖాళీకడుపుతో మిగిలిపోయింది.

"పదరా! సర్పంచుకైనా చెప్పుకుందాం!" పరంధామయ్య కొడుకుల్ని లేవదీసుకుని నడిచాడు. వాళ్ల వెనక నర్సమ్మ దీనంగా..

ఆమె వెనక బిడ్డ నడిచింది.

సర్పంచు ఇంట్లో గొడవ విని భయపడిపోయాడు. పరంధామయ్య, విధిలేక చాటుగా గోడ కానుకుని నించున్నాడు. కొడుకులు సైతం అయ్య పక్కనే నక్కిపోయారు.

పటేలు, సర్పంచు ఎదురెదురుగా కూచున్నారు. మధ్యన నేల మీద పాలేరు యెంకటిగాడు కూసున్నాడు.

సర్పంచు వాడి సేతుల పది రూపాయలు పెట్టి, "తీసోంటవా? లేదా.." అన్నాడు.

"తీసోలేన్బాంచెన్," చెప్పుకుంటూ చేతులు జోడించాడు. యెంకటిగాడు. "అయ్యగారూ! మీమాట ప్రకారం మా దగ్గరోడైనా గని, అనిల్లు కాలబెట్టిన. ముందుగాల చెరి ఇరవై అయిదు వొప్పుకోని ఇప్పుడు పదిరూపాయలిత్తే ఎట్ల తీస్కోవాలె. బాంచెన్, ఏం జేస్కోవాలె ఇవి? సెరి ఇర్వయన్నా ఇప్పించండ్రి ధర్మ దొరలు!" అని చప్పున ఆగిపోయి ఆశగా చూశాడు యెంకటిగాడు.

"ఏంరో? ఇద్దరం కల్సి పదికంటె ఎక్కువ ఇవ్వం. పదైతే తీస్కో! లేక్పోతే లేదు. నీ ఇష్టం." అన్నాడు పటేలు సర్పంచు తరఫున కూడా మాట్లాడుతూ.

"అయ్యా! గుట్టుగా పనిజేసి పెట్టాను. గుట్టుగా పైసలిప్పించండి. లేక్పోతే మల్ల బాగుండదు," అన్నాడు కొంచెం ధీమా తెచ్చుకుంటూ.

'ఏరా, ఏమంటున్నవ్? బాగుండదురా! బాగ, ఏం బాగుండదో మేమూ చూస్తా," మని మూలకున్న ఎలితె కట్టె తీసుకొని బాదటం మొదలెట్టాడు సర్పంచు.

పరంధామయ్యకి ఒళ్లు మండింది. ఒంటి మీద దెబ్బలు పడ్తున్నట్లని పించింది. అసలు సంగతంతా అర్థమైంది.

తన ఇల్లు కాలబెట్టిందెవరో, కాలబెట్టిచ్చిందెవరో? అంతా తెల్సిపోయింది. పరంధామయ్య కోపం రాత్రి కాలిపోయిన పందిరి మంట కంటే భయంకరంగా మండిపోతుంది.

అమాంతం రంగం మీదికురి కాడు.

యెంకటిగాడు కోపంతో ఊగిపోతున్న పరంధామయ్యని చూచి గజగజా వణికిపోయాడు.

కానీ పరంధామయ్య యెంకటిగాణ్ణేమీ అన్లేదు. పటేలు, సర్పంచుల మీద విరుచుకుపడ్డాడు. సర్పంచు చేతిలోంచి కట్టె లాక్కున్నాడు పరంధామయ్య.

ఆ వెనకాలే పరంధామయ్య కొడుకులిద్దరూ, తండ్రి చేతిలోంచి కట్టె లాక్కొని సర్పంచు, పటేల్లిద్దరి మీదా పడిపోయారు. రావణ కుంభకర్ణుల మీద విరుచుకుపడ్డ రామలక్ష్మణుల్లా.

పరంధామయ్య కోపంతో ఉడికిపోతున్నాడు.

అప్పటికీ బుద్ధి తెచ్చుకున్న యెంకటిగాడు పరంధామయ్య కాళ్ల మీద కువ్వలా కూలిపోయాడు.

> "తన ఇల్లు కాలబెట్టిందెవరో,
> కాలబెట్టిచ్చిందెవరో?
> అంతా తెల్సిపోయింది.
> పరంధామయ్య కోపం రాత్రి
> కాలిపోయిన
> పందిరి మంటకంటే
> భయంకరంగా మండిపోతుంది"

కొత్త శీర్షిక

సమస్యలన్నీ యధాతథమే.
కొత్త సమస్యలు ఎన్నో వచ్చినా
పాతవన్నీ పరిష్కారం కానివే.
ఎన్నో సంఘటనల
యదార్థ వ్యదార్థ
జీవన సారాంశమే కథా కథనాలు.
పాత కొత్తల
మేలు కలయిక కథలసారం.
సరికాని పాత చిక్కులు
విడిపోని గతం ముడులు
నాటి సమాజ స్థితిగతులు
నేటికీ మారని వైనాన్ని తెలుసుకొనే
మహత్తర కథల పరంపర

## కథల వంతెన

(నాటి తరంవారి కథలు నేటి తరానికి)
ఈ శీర్షికకు ఆలోచింపజేసి చైతన్యపరిచే
25 ఏళ్ళ క్రితం రాసిన కథలకు ఆహ్వానం
-సంపాదకులు

## కాలం నా నేస్తం

కొందరు
కాలం కలిసి రావడం లేదన్నారు
మరికొందరు
కాలం ఎవరికోసం ఆగదన్నారు
ఇంకొందరు
కాలం తిరిగిరానిదన్నారు
కాలం చిత్రమైంది సుమా !
నే ననుకున్నాను,
కాలం నాతోనే ఉందని
నాతో పాటే నడుస్తోందని
కానీ, కాలం
నిన్నటి నుంచి నేటి లోకి
ఎప్పుడు వచ్చేసిందో తెలియదు
నేను ఆలోచనల్లో
నిన్నలోనే ఉన్నాను
బండ్లు ఓడలయ్యాయి
ఓడలు బండ్లయ్యాయి
కాలమహిమ అన్నారు కొందరు
కాలం ఎక్కడుందో అని
వెతుకుతున్నాను
తీరా చూస్తే, నాతోనే ఉంది!
అయినా
కాలం పరిగెడుతూనే ఉంది
కాలం నిత్య చైతన్యశీలి!
ప్రవహించే కాలానికి
అడ్డుకట్ట వేయలేమని
కాలంతో జోడి కడితేనే
కాలం కలిసి వస్తుందని అర్థమైంది
కాలంతో కలిపా హస్తం
ఇప్పుడు,
కాలం నా నేస్తం.!!

– కమలేకర్ శ్యాం ప్రసాద్ రావు
9441076632



## అనర్థాలకు మూలం..

అనుమానమనే పెనుభూతానికి
చెప్పుడుమాటలే కారణభూతులు,
వినేవారుంటే ఎన్నైనా నూరిపోసే
ప్రభుద్ధులున్న సమాజం మనది,
కొంపలుకూల్చాలనుకునేవారు
నీవెన్నంటేఉంటారన్నది మరువకు,
అపోహలకు తావిచ్చి అనర్థాలను
సృష్టించుకొనక సాగించు నీ పయనం,
ముళ్లను గుచ్చుకొనక
రాళ్లను తన్నుకొనక
ఎత్తుపల్లాలకుదొర్లుకొనక
ఆత్మస్థైర్యం వీడక
ఆనంద సాగరంలో
సాగించు నీ పయనం,
నీవుముఖాముఖిమాట్లాడితే
వీగిపోయేగాలివాటుఅపోహలు
నీటిమీద బుడగలు వంటివి
అపోహలే అనర్థాలకు మూలం
తస్మాత్ జాగ్రత్త "

–రాయవరపు సరస్వతి
7989665525



## అర్హులు

చలికాలం రాగానే మదిలో మెదిలేది
సహజ అంగరక్షకుల్లా ఠీవిగా నిలిచి
సరిహద్దుల్లో వెండి కొండల్లా మెరిసే
సజీవ నదుల పుట్టినిల్లైన హిమాలయాలు!–
మంచు పర్వతాలన్న మరుక్షణం స్ఫురించేవి
మాత్సర్యపు మలిన కొలనులో నిత్యం మునుగుతూ
మిన్నాగుల పగతో నిరంతరం రగులుతూ
మన భూమి నాక్రమించ మాటువేసి ఉండే పొరుగు దేశాలు!–
పొరుగుదేశాల ఊసెత్తగానే మనసులో కదిలేది
ఒక కంట కరుణ నొలికిస్తూ.. మరో కంట కసిమంటల్ని రాజేస్తూ
ద్వంద్వనీతిని పాటించే ఆయా దేశాల నేతల
పన్నాగాల్నించి అనుక్షణం కాపాడే రెప్పవాల్చని మన సైనికులు!–
సైనికులనగానే గుర్తుకొచ్చేది.. మైనస్ డిగ్రీల మహా శీతలాన్ని
మంచుగడ్డలతో నిత్య సావాసాన్ని మనస్ఫూర్తిగా ప్రేమిస్తూ
సంకల్పబలంతో సాగే కర్తవ్య రూపులు!
త్యాగపు ప్రతినిధులు!
అందుకే, అనిపిస్తుంది..
ప్రతిప్రభాత వందనానికి వారే నిజమైన అర్హులని!

– ఎస్. కాశింబి
సెల్: 9052216044



పుస్తక సమీక్ష

# మంచిని పెంచి ప్రేమను పంచే కథలు..

అక్షరాలను అభిరుచిగా మార్చుకున్న డా॥ పి. విజయలక్ష్మి పండిట్ గారి సాహితీ ప్రయాణంలో సంపుటి **"పేగుబంధం"** వీరి రెండవ కథా మజిలీ. **"రమ్య ది రోబో"** వీరి మొదటి కథా సంపుటి. 45 ఏళ్ళ సుదీర్ఘ సాహితీ యానంలో రెండు దీర్ఘ కవితలు, 7 కవితా సంపుటాలు, 3 అనువాదాలు అందించి తమ పటిమను నిరూపించుకున్నారు. రవీంద్రనాథుని 'గీతాంజలి' తెలుగులోకి అనువదించి 'ఔరా! అనిపించుకున్నారు. గజళ్ళపై మక్కువతో 3 గజళ్ళ సంపుటులను తెలుగు పాఠక లోకానికందించారు. ఏ ప్రక్రియ చేపట్టినా సానుకూల, సాధికార రంతస్వరంతో ఆకట్టుకోవటం వీరికి వెన్నతో పుట్టిన విద్య. పలు పురస్కారాలు, బిరుదులు వీరిని వరించాయి. ఇతర భాషల్లోకి అనువదింపబడి తెలుగేతర పాఠకులను కూడా రంజింపచేసాయి. విశ్వ పుత్రిక వీరి కలం పేరు, బోధనాను భవం విజయలక్ష్మిగారికి మరింత తోడ్పడి, పాఠకుల నాడి పట్టుకోగలి గారు. కాలంతో సమంగా నడుస్తూ వర్తమాన సామాజిక జీవితంలోని వైరుధ్యాన్ని సంక్లిష్టతలని, ముఖ్యంగా స్త్రీలు ఎదుర్కొనే సమస్యలను చర్చకు పెట్టుతారు. చర్చించి వివరించటమే కాదు. వాటిని ఎదుర్కుంటూ ఎలా ముందుకు సాగాలో సూచిస్తారు. కాఠిన్యం, క్రౌర్యం వీరి కథల్లో గోచరించవు. సరికదా వెన్నెల రాత్రి పడవ ప్రయాణంలా సాఫీగా సాగుతాయి. స్త్రీవాదం దళితవాదం, మైనారిటీ వాదంలా వీరి కథలను **'మనసు వాదం'** కథలు అనవచ్చును. **'మీటూ...'**లాంటి సమస్యల్ని కూడా అలవోకగా స్పృశిస్తూ, రేఖామాత్రంగానే వివరిస్తూ, సాగుతారు. సమస్యను వివరించి పరిష్కారాన్ని పాఠకులకు వదిలేయకుండా, మార్గదర్శనం చేయటం విజయలక్ష్మి






**ప్రతులకు:**
పాలపిట్ట బెక్స్
హైదరాబాద్-36.
సెల్: 98487 87284
మరియు అన్ని ప్రముఖ పుస్తక కేంద్రాలు.

పండిట్‌గారి ప్రత్యేకత.

సంపుటిలో ఇచ్చిన 14 కథలన్నింటా, స్త్రీపాత్రలే ప్రాముఖ్యత వహిస్తాయి. వారు మాత్రమే చూపగల మమత ప్రేమకారుణ్యం, మంచితనం వివరించబడి, పూవులు పరిచిన దారిలో నడుస్తున్న అనుభూతి కలుగుతుంది.

అద్దెకు ఇవ్వబడ్డ అమ్మగర్భం వ్యాపారవస్తువే! అయినా **'పేగుబంధం'** కథలోని నీలవేణికి అలా అనిపించదు! అప్పటికే ఇద్దరు పిల్లల తల్లి అయినా, ఆర్థికావసరాలకు ఆమె తన గర్భ సంచిని 'అద్దెకు' ఇచ్చినా, తల్లి మందలించినా, నీలవేణికి అలా అనిపించదు. మాతృత్వపు మధురానుభూతికి ఆమె మనసు వెంపర్లాడుతుంది. అంతే కాదు. సంవత్సరం గడిచాక ఆ 'కన్నయ్య' పుట్టిన రోజు సందర్భంగా కేండిల్ వెలిగించి కేక 'కట్' చేయిస్తుంది. 'సరోగసీ' మీద ఎన్నో కథలు వచ్చాయి. కాని ఈ కథ ఒక విలక్షణం అనిపిస్తుంది. నీలవేణితో బాటు పాఠకులు కూడా చెమ్మగిల్లుతారు.

జీవితాలు అంటే సమస్యకాదు. అది వాస్తవాలు. అనుభవించటమే అంటారు **'జీవితమంటే..'** కథలో. జయ అనురాధలు స్నేహితులు అనూరాధ కూతురు సిరి అల్లుడు ఆనంద్. వీరిద్దరూ పరస్పరం ఇష్టపడే పెళ్లి చేసుకున్నా, పొరపొచ్చాలు వస్తాయి. సిరి ఆనంద్‌లు విడిపోవటానికి నిశ్చయించుకుంటారు. ప్రాణ స్నేహితురాలి కూతురుకు ఇలా అవటం అనూరాధ దంపతులను కలచివేస్తుంది. 'ఈతరం యువతీ యువకులకు అవగాహన, ధైర్యం లేకపోతే జీవితాన్ని ఒక సమస్యగా తీసుకుని కుంగిపోతారు' అని చెబుతూ కథ ముగిస్తారు రచయిత్రి. What cannot be cured, must be endured' అన్న, famous ఇంగ్లీషు సామెత ప్రకారం కథ ముగించటం బావుంది.

సుమారు రెండేళ్ళ పాటు యావత్ప్రపంచాన్ని అతలాకుతలం చేసిన కరోనా కష్టకాలాన్ని వివరిస్తూ 'దృక్పథం' కథలో రచయిత్రి బెంబేలు ఎత్తి పేజీలకు పేజీలు ఆ భయానక కాలాన్ని వర్ణించి భయం కలిగించలేదు. ప్రకృతి ప్రకోపించు ఎంతో జననష్టం ఆర్థిక వనరులు దెబ్బతినటం కొత్తేమీ కాదు. ప్లేగు, మశూచి, కలరా వంటి ప్రాణాపాయ జబ్బులు, ఎపిడమిక్‌లను పూర్వం ప్రజలు ఎదుర్కొన్నారు. అలాంటి ప్రమాదాల గురించిన అవగాహనను తీసుకోవాల్సిన జాగ్రత్తలను తెలుసుకుని పాటిస్తూండాలి మనిషికి. కావాల్సింది ఆశావహ దృక్పథం, పట్టుదల, ధైర్యసాలు అంటారు. ఇలా అంటూనే భారతీయులు ఇంటికి రాగానే ఇంటి ముందున్న గంగాళంలోనో తొట్టిలోనో పెట్టిన నీళ్ళతో కాళ్ళు చేతులు కడుగుకునే వారు అంటూ దేశ సంస్కృతిని ఆచారాలను పేర్కొనటం కథకు బాగా సరిపోయింది. గణాంకాల ప్రకారం, భారతదేశం అభివృద్ధి చెందాల్సిన దేశమే అయినా మన సదాచారాల వల్ల కరోనా ప్రభావం తక్కువగానే ఉండినదట!

కథ లంటే.. ఏమిటో వివరిస్తూ రచయిత్రి, కథ పుట్టు పూర్వోత్తరాలు వివరించటం. రామాయణ భారతాలను ప్రస్తావిస్తూ ఆ కథల్లోని సందేశాలను హైలైట్ చేసారు. 'మనిషి కథే నా కథ.." నా కథే మనిషి కథ' అన్నీ ఒక్క ముగింపు వాక్యంలో ఎన్నో పేరాలకు సరిపడ సందేశం ఇచ్చారు.

దాదాపు అన్ని కథల్లోనూ 'ఫ్లాష్‌బాక్'లు ఇస్తూ కథ నిడిచి తగ్గించటం, బావుంది. క్లుప్తత, కథకుండాల్సిన ఒక మంచి లక్షణం.

సాంఘిక సామాజిక కథలే కాదు, హాస్య కథలను కూడా అతి ప్రతిభావంతంగా వ్రాయగలను అని నిరూపించుకున్నారు. 'దోమల వేట'తో. పురాణ గాథల్ని నేటి కాలాన్ని జోడించి చెప్పిన 'నవగుంజర' రచయిత్రి పరిశీలనా చతురతను తెలియ చేస్తుంది.

**'జ్ఞాపకాల గోడ'** చదువుతూన్న పాఠకులకు ఇది కూడా ఒక కథేనన్న ఫీలింగ్ రాకుండా అతి సహజంగా చెబుతూ, ఓ అర శతాబ్దం వెనక్కి తీసుకెళ్ళారు. నాటి ఫిల్టర్ కాఫీ ఘుమ ఘుమలు, జాతకాలు, నమ్మకాలు పెరట్లో రకరకాలు పూలు, మాలలు కట్టటం, దేవిడలు, దీపపు గూళ్ళు ఎత్తు రాతి ప్రహరిగోడలు, తిరునాళ్ళు, ఊరేగింపులు, దినుసుల గది పశువుల కొట్టం నడుముకు చేతులు పెట్టుకుని నవ్వుతూ పలుకరించే తెల్లని పెద్ద కృష్ణుని విగ్రహం.. సీనియర్ పాఠకులకు ఆనందం కలిగించే జ్ఞాపకాలు.

మంచిని పెంచి సమాజం పట్ల ప్రేమను పంచే కథలివి.

– కూర చిదంబరం
సెల్: 8639338675






ఆమెకు నెత్తిన
గింజలు పడ్డప్పటి నుండి
పేదరికపు పేగును
భుజాలపై మోస్తూనే ఉంది
గంజి గింజల కోసం అరిగోస పడ్తూ
బత్కు సమరం సాగిస్తూనే ఉంది
ఆరు పదుల వయస్సులో కూడా
కాళ్లకు చక్రాలను కట్టుకొని
నెత్తిన బుట్టను పెట్టుకొని
అవనిపై అస్థిపంజరమై
కదుల్తుంది పూసబేరలమ్మ
కాలానికి ఎదురీదుతుంది
పూస బేరలమ్మ.

పాత చీరను కట్టుకుని
పైట కొంగును చుట్టుకొని
కండ్లను కాగడాలుగా చేసుకొని
పొయ్యి వెలిగించే సూర్యుల కోసం
ఆశల అగరవత్తులను
వెలిగించుకుంటూ
ఊరు వాడ తిరుగుతుంది
పూస బేరలమ్మ
తట్ట ఖాళీ కోసం
తడ్లాటపడుతుంది పూసబేరలమ్మ
అమ్మ, అక్క, చెల్లి, బిడ్డ అంటూ
మానవ బంధాల బొంతను కలిపి
కుడుతూ
గుండె లోతుల్లోని
మాటలను పంచుతుంది
పసిమొగ్గలకు పరుల నీడ పడకుండా
జిస్టి పూసలను
కన్నె పిల్లలకు కాళ్ళకు సోకుల దారాలను
మగువలు మెచ్చే మెరుగైన గాజులను
ఇంటి ముందే
ఇంపైన ధరలకు ఇచ్చేస్తది.

పది రూపాయల సొమ్మును
ఐదు రూపాయలకే అడిగే
అమ్మలను చూసి
ఈసమంతా ఈసడించుకోకుండా
పెదవుల పై
నవ్వుల పూలను పూయిస్తది
కొందరు ఊసుపోకుండా ఉద్దెరడిగినా
మాట కాదనలేక
నమ్మకపు మొక్కను నాటుతుంది
మాటల గోడలను కట్టుకుంటూ
మదిలో నిలిచిపోతది పూసబేరలమ్మ

కట్టుకున్నోడు చాప చుట్టేసినా
కడుపులో కాసిన కాయలు చేరదీయకున్నా
ఆమే ఒక సైన్యమై సాగిపోతూ
బత్కు యుద్ధాన్ని జయిస్తుంది
మధ్యలోనే తనకు తానే ఊపిరి దీపాలను
ఆర్పేసుకొనే మనుషులకు
నిలువెత్తు నిదర్శనమై నిలుస్తుంది
పూసబేరలమ్మ
జీవిత పాఠమై మెరుస్తుంది

–తాటిపాముల రమేశ్
7981566031



# ఆ చుండూరు మృతవీరుల స్మృతిలో నెత్తుటి ధారల కథ

–మహాకవి డా॥ కత్తి పద్మారావు
9849741695



ఆకాశము నుండి పూల వర్షం
కురుస్తుంది
అమరవీరుల స్థూపాలకు
సైనిక వందనం
ఆ వాహనంలో ఆధిక్య స్థానంలో
గిరిజన మహిళ
ఆ శకటాలంతా గిరిజన స్త్రీ నృత్యాలే!
ఈ దేశానికి
రాజ్యాంగం సమర్పించబడిన రోజు
అదో పండుగ
అంతర్గర్భంలో బ్రాహ్మణవాదం
అభి ముఖం ఆదివాసీలది
నిజమే! మణిపూర్ గుండెల్లో
గాయాలు సలుపుతూనే ఉన్నాయి
ఔను! వారు సందిగ్ధంలో ఉన్నారు
జీవితం జరుగుతుందా?
జరిగిపోయిందా అని?!
మనుషుల్లో కుదురు తప్పింది
చలితా చలితంగా ఉన్నారు
తోడులో సంయమనం ఉందా?
సంవేదన ఉందా?
వేదన ఉందా?
సంతోషం ఉందా ?
సమరం ఉందా ?
భిన్న ప్రకృతుల యుద్ధమా?
భిన్న కోరికల సమరమా?!
ఎవరో స్వేచ్ఛను హరిస్తున్నారనే భావన
అంతర్మథనం తగ్గింది
అన్యాపదేశత పెరిగింది
ఏది సౌందర్యం? ఏది భ్రమ?
ఏది అభినందన?
ఏది అభిశంసన?
ఆత్మాభిమానానికి,
అధీనతకు ఘర్షణ
ఔను! ఆ సంభాషణలో
మృదుత్వం తగ్గింది
ఘర్షణ పెరుగుతుంది
చూసే చూపులో వైరుధ్యం
మాటల్లో కాఠిన్యం
అందుకే జ్ఞానులు నిశ్శబ్దాన్ని ప్రేమిస్తున్నారు
ఆ పోరాట గాథలో
నిశ్శబ్దం కూడా దాగి ఉంది
ఆ చుండూరు అమరవీరుల
రక్త క్షేత్రం చెప్తున్న చరిత్రలో
నెత్తుటి ధారలు ఇంకా ప్రవిస్తున్నాయి
నిశ్శబ్దంలో మూలుగులు
నిశ్శబ్దంలో నుంచి ప్రతిఘటనలు
ఔను! వాళ్లు పోరాటంలో
ఆ ఊరినే తగలబెట్టారు
మళ్లీ అక్కడ భవనాలు లెగిసాయి
భావం బతికే ఉంటుంది
ప్రతిఘటన చరిత్ర అవుతుంది
అనంత సమరం మధ్య
చిన్న కునుకు
నిజమే! చాలా మందికి నిద్ర లేదు
రాజ్యకాంక్ష, ధనకాంక్ష,
ఆధిపత్యకాంక్ష పెరుగుతున్నాయి
అనంత భాషను వారు కుమ్మరిస్తున్నారు
ఆ ముసలి గాడిద
అమలిన వస్త్రాలను
మోసుకుని తిరుగుతుంది
ఎక్కడా దించడానికి ఖాళీ లేదు
ఔను! తిండి గింజలు
ఇస్తామనే వారే గానీ,
భూమిని ఇస్తామనే పాలకులే లేరు
తమను తాము పాలించుకోలేనివారు
దేశాన్ని ఏమి పాలిస్తారు?
నోటి మీద, మాట మీద, నీతి మీద
నిబద్ధత లేదు
ప్రకృతికి గతి తర్కం ఉంది
మనిషి ఆలోచనకు లేదు
ఎందుకు గతులు,శ్రుతులు తప్పి
జీవిస్తున్నారు?
ఔను! అర్ధరాత్రి తర్వాత
ఇంకో ప్రపంచం నడుస్తుంది
అప్పుడు నల్ల సముద్రాలు
పొంగుతున్నాయి.
సహజమైన చీకటికీ,
కృత్రిమమైన వెలుగుకీ యుద్ధం!
ఎదురుగా విషాహారం పెడుతున్నారు!
తింటే చనిపోతారని బోర్డులు పెడుతున్నారు!
అబ్రహం లింకన్
ఏడు అక్షరాల సంతకంతో
బానిసత్వం నిర్మూలన చేశారు
ఆ ఒక్క సంతకం తెల్ల భవనంలోకి
నల్ల ప్రతిభకు ప్రవేశం కల్పించింది
నోరు కట్టివేసి దళిత ప్రతినిధులను
పార్లమెంటులోకి నెడుతున్నారు
ఉక్కు నాలుకలు కూడా
అక్కడ బంధించబడతాయి
ఔను! భవనం సుందరంగా ఉంది
స్వేచ్ఛాహననం జరుగుతుంది
హక్కులు నిరాకరించబడ్డాక
జనజీవనంలో అలజడేగా!
మనుషుల్లో మమతలు తగ్గాక
మర బొమ్మలేగా మిగిలేది!
ఆ అంబేద్కర్ జీవన గాథ
తిరుగుబాటు నేర్పింది
ప్రశ్నను నేర్పింది
నిజాయితీని నేర్పింది
నీతిని నేర్పింది
ఆత్మగౌరవాన్ని నేర్పింది
సత్యం మాట్లాడు
ధర్మాన్ని ఆచరించు అనేగా
రాజ్యాంగ సూత్రాల నిర్మాణం
ఈరోజు నుండైనా
ఆ నవయానుని
మార్గంలో నడుద్దాం !




రాసే ఆసక్తి కలవారు సప్తపదులు వాట్సప్ గ్రూప్‌లో చేరి అక్కడ నియమాలు తెలుసుకుని గ్రూప్‌లో రాయండి.రోజూ అక్కడ వందలాదిగా వచ్చేవాటి నుంచి ప్రతివారం ఎన్నికయిన 25 సప్తపదులు "నేటినిజం"లో ప్రచురితం కాగలవు.




పవనాలు
కవనాలు
అనువుగా సాగితే వికసించు
హృదయ నయనాలు!
-యన్.కే. నాగేశ్వరరావు
పెనుగొండ.

విషయము
వినయము
విలువ తెలిసి మసలుకున్న
తథ్యము విజయము
-అర్చన కోపూరు, హైదరాబాద్

వేదన
వాదన
తల్లిపాల భాష మరవద్దని
మేధావుల రోదన
-వై.పద్మ,కొత్తగూడెం.

స్వతంత్రదేశం
ఉపదేశం
లౌకికవాదానికి రక్షణ సమసమాజానికి
ప్రేరణ భారతగణతంత్రసందేశం
-వి.ఎస్.వి ప్రసాద్, తణుకు

దివ్యమందిరం
భవ్యమందిరం
కాంతులీనే చిరునవ్వుల
బాలరాముడుతో పులకించే
మదిమందిరం
-రామకూరు లక్ష్మి మణి,హైదరాబాదు

రాత
గీత
రెండూ బాగులేకపోతే
బ్రతుకుమీద పుడుతుంది రోత.
-గంపా శ్రీదేవి, అనకాపల్లి.

పేచీ
పూచీ
తీర్పు చెప్పే మధ్యవర్తి కాకూడదు
లాలూచీ!
-గోపరాజు వెంకట సూర్యనారాయణ
హైదరాబాదు

శక్తి
యుక్తి
కలిసిన రోజు–
చివరకు గెలిచింది భక్తి .
-భాగ్యశ్రీ ముత్యం, కొవ్వూరు.

రక్తదానం
నేత్రదానం
ఉన్నతమైన ఆశయాలతో పరిశోధనల
కోసం వైద్యకళాశాలలకు
అవయవదానం
-కట్టెకోల చిన నరసయ్య, ఖమ్మం

ఏమయ్యా
రామయ్యా
సర్వాలంకృత దివ్యమూర్తిని
దర్శించిన జన్మ పావనమయ్యా
-సింగీతం విజయలక్ష్మి, చెన్నై

అల్లా
అల్లా
తరచి.. చూస్తే ఒకరే కర్త సృష్టికెల్లా
-భాగవతుల కృష్ణారావు,
సికింద్రాబాద్

దేవుడు
జీవుడు
తాను కూడా దైవాంశేనని
తెలియని మానవుడు!
-డాక్టర్ గన్నోజు శ్రీనివాసాచార్య
మహబూబ్ నగర్.

గొడుగు
అడుగు
రెండింటితో తెలుగుభాషకు
వన్నె తెచ్చాడు గిడుగు.
-దోసపాటి
వేంకటరామచంద్రరావు
విజయనగరం

రామమందిరం
అతిసుందరం
కట్టుకున్నాము మనజేబులో డబ్బుతో
కష్టపడి మనందరం
-ఉపద్రష్ట సుబ్బలక్ష్మి, హైదరాబాదు

రమ్యం
గమ్యం
పచ్చకోకతో వెన్నెలరథంలో విహారం
ప్రకృతికాంతకు ప్రాధమ్యం!
-విన్నకోట ఫణీంద్ర, హైదరాబాద్

షట్పది
అష్టపది
కన్నడసంస్కృతాలకు దీటుగా తెనుగున
శోభిస్తున్న సప్తపది!
-గోగినేని రత్నాకరరావు, తెనాలి.

ఉప్పు
నప్పు
మిగితా వంటకాల
వాసనల రుచులకుతెచ్చు మెప్పు
-తిరుమల వెంకటస్వామి
హైదరాబాదు

వడి
సడి
ముదిమి చేరినా
మరువలేనిది మధురోహల జడి
-భాగవతుల కృష్ణారావు, సికింద్రాబాద్

ఎగపడు.
కలబడు,
విజయానికి చేరువయ్యే వరకూ
ఓపికగా నిలబడు.
-తెలగారెడ్డి సత్యా నందం.
సిడ్నీ.ఆస్ట్రేలియా.

యోగము
భోగము
అతిగా...తినడము శారీరక,
మానసిక రోగము
-బిక్కునూరి రాజేశ్వర్, నిర్మల్

చేసేదొకటి
కోరేదొకటి
మధ్యనుండు మనిషి బ్రతుకులో
కడుకు తేలేదొకటి
-కె.కె.తాయారు, మదనపల్లి

హితముగా..
సన్నిహితముగా..
మగువ అలిగినవేళ మసలుకోవాలి
మరింత సున్నితముగా !!
-పేరిశెట్టిబాబు, భద్రాచలం

జరుగు
కరుగు
అవసరమైనప్పుడు స్పందించకపోతే
మనకన్నా జడపదార్థాలు మెరుగు
-ఆలేటి పరంజ్యోతి ,ఖమ్మం

ఎదగనీయండి
బతకనీయండి
పర్యావరణాన్ని దాని సహజమైన
స్వచ్ఛతతో మననీయండి
-జూపూడి హనుమంతరావు
హైదరాబాద్

సంస్కారం
పురస్కారం
ప్రభుత్వం ప్రకటించిన
పద్మవిభూషణ్ గ్రహీతలకు
నమస్కారం
-కె.వరలక్ష్మీదేవి, కర్నూలు

# పుష్పాలు-పిల్లలు



పరిమళాల పువ్వులు
పువ్వుల్లాంటి పిల్లలు
పంచదార పూతరేకులు
పూత రేకుల్లాంటి పిల్లలు.

తళుక్కుమనే మెరుపులు
మెరుపుల్లాంటి పిల్లలు
తళతళల వెన్నెలలు
వెన్నెల్లాంటి పిల్లలు.

మల్లెపూల మనసులు
మెత్తనైన మనసులు
చంద్రవన్నెల మనసులు
చల్లనైన మనసులు.

సున్నితమైన పిల్లలు
సునిశితమైన పిల్లలు
స్వచ్ఛమైన పిల్లలు
సుమనసుల పిల్లలు



-డా॥కందేపి రాణీప్రసాద్
9866160378

| ఫిబ్రవరి | | నేటినిజం | | | 2024 |
|---|---|---|---|---|---|
| ఆది వారం |  | 4 | 11 | 18 | 25 |
| సోమ వారం | | 5 | 12 | 19 | 26 |
| మంగళ వారం |  | 6 | 13 | 20 | 27 |
| బుధ వారం | | 8 | 14 | 21 | 28 |
| గురు వారం | 1 | 7 | 15 | 22 | 29 |
| శుక్ర వారం | 2 | 9 | 16 | 23 | |
| శని వారం | 3 | 10 | 17 | 24 | |

## పండుగలు-ముఖ్యదినములు

6. మతత్రయ ఏకాదశి
7. షబ్-ఇ-మీరజ్
8. మాస శివరాత్రి
9. చొల్లంగి అమావాస్య పురంధరదాసుల ఆరాధనోత్సవం
10. శ్రీ శ్యామలా నవరాత్రులు ప్రారంభం
11. చంద్రోదయం
12. స్వామి దయానంద సరస్వతి జయంతి
13. కుంభ సంక్రమణం రా.7-15
మార్కండేయ మహర్షి జయంతి
14. వసంత పంచమి
16. రథసప్తమి, సూర్య జయంతి భీష్మాష్టమి, బాసర సరస్వతీదేవి పల్లకీ సేవ.
16. శ్రీ కృష్ణదేవరాయ జయంతి
18. మధ్వ నవమి
19. రామకృష్ణ పరమహంస జయంతి, శివాజీ జయంతి
20. భీష్మ ఏకాదశి, అంతర్వేది తీర్థం.
21. మేడారం శ్రీ సమ్మక్క సారాలమ్మ జాతర ప్రారంభం
22. రామ తీర్థంలో శ్రీరాముల వారి వార్షిక కళ్యాణం
24. మాఘ పూర్ణిమ, మహామాఘి మేడారం శ్రీ సమ్మక్క సారాలమ్మ జాతర ముగింపు.
25. షబ్-ఇ-భారత్, అవతార్ మెహర్‌బాబా జయంతి
28. సంకటహర చతుర్థి.

పుస్తక సమీక్షలు

# వారాల ఆనంద్ అద్భుత అనుసృజన- ఇరుగు పొరుగు సంపుటి




ప్రతులకు:
శ్రీమతి వారాల ఇందిరారాణి
ఇ.నెం.8-4-641
మనుమాన్‌నగర్,
కరీంనగర్-505 001. తెలంగాణ
సెల్: 9440501281



29 భారతీయ భాషలలోని 90 మంది ప్రఖ్యాత కవుల కవితా హృదయ సమ్మిళితంగా, 152 కవితల అనువాద సంకలనం, సాహిత్య అకాడమీ అనువాద ప్రక్రియ రచనా పురస్కార విజేత వారాల ఆనంద్, తెలుగు సాహితీ వేదికపై ఆవిష్కరింప చేయడం ఎంతైనా అభినందనీయం. హిందీ, కాశ్మీరీ, ఉర్దు, తమిళం, ఒడియా, కొంకణి, మలయాళం, సింధి, ఇంగ్లీష్, కన్నడ, బెంగాలీ, అస్సామీ, గుజరాతీ, రాజస్థానీ, పంజాబీ, మణిపురి, మైథిలి, సంబల్‌పూరి, డోగ్రి, మరాఠీ, ఆది, భోజ్‌పురి, ఏచిక్, ఖాసీ, సింహళ, నేపాలీ మగధ్, బోడో, సంస్కృతం, భాషా ప్రాంత ప్రాంగణాల కిటికీలు తెరిచి, కవితా పరిమళాలను తెలుగు సాహితీ ప్రియులచే ఆస్వాదింప చేయడం అనితర సాధ్యమైన ఐక్యతా భావానుబంధం. ఎవరికి వారు గిరిగీసుకొని, స్వోత్కర్ష స్వకుచ మర్దనాలతో విర్రవీగే మేధాపరత్వం విజృంభిస్తున్న సంకుచిత వాద తత్త్వంలో 'ఇరుగు పొరుగు' కవిత్వ సంపుటి, అద్భుత సాహితీ మహోన్నత సుగంధ సౌహార్దం వికసింప చేస్తోంది. భారత దేశంలో భాషా ప్రయుక్త రాష్ట్రాల ఆవిర్భావానికి శ్రీకారం చుట్టిన మన మాతృభాషా మాధుర్యం దేశ భాషలకు సుపరిచితమైనా, వివిధ భాషా సాహిత్యాలను మన చదువరులు ఆకళింపు చేసుకోవలసిన అనువాద విస్తృత సాహితీ ప్రతిభా ఔన్నత్యం మన సాహితీకారులకు మృగ్యం. భాషా సాహిత్యాల మధ్య 'ఆదాన్ ప్రదాన్' ప్రాధాన్యతను గుర్తించిన 'వారాల ఆనంద్'ను అపురూపమైన అరుదైననీ సాహితీ వేత్తగా సంభావించవలసినదే. యిక ఈ సంపుటిలోని కవితలు ఏర్చి, కూర్చిన అమృతాక్షరాల మణిపూసల సమాహారం. 'జ్వాల రగిలిస్తాయి. 'వెన్నెముక' ఓటమి 'అన్వేషణ' వెనక్కి నడిపిస్తుంది. 'నాన్న' మళ్ళీ పూపిరి పోసుకుంటుంది. 'పొట్టి' జీవితంలో పోటీని ప్రశ్నిస్తుంది. 'రుతువు'లో గాలివాటం నాయకుల ప్రస్తావన వస్తుంది. 'సుందరి' నీ కిటికీల్ని తెరిచి ఉంచవూ అంటుంది. హృదయాన్ని కదిలించేటట్టు , అంతరంగాన్ని ఆవిష్కరిస్తూ సరళమైన అనుసృజన సృష్టించిన 'ఇరుగు పొరుగు' ప్రతీ సాహితీ ప్రేమికుడు అవలోకించవలసినదే. ఆనంద్‌గార్కి అభినందనలు.

-జయసూర్య
సెల్:9014948336

# రేపటి 'కాలం' కోసం 'పున్నమి' కవితా సంపుటి




ప్రతులకు:
పున్న అంజయ్య
6-2-954/2, రోడ్ నెం.3
కాకతీయనగర్, మీర్‌బాగ్ కాలనీ
నల్లగొండ-508 001
సెల్: 9396610639

'పున్నమి కలం పేరుతో పున్న అంజయ్య, ముత్యాలలాంటి కవితలను ఏర్చి కూర్చి 'కాలం' కవితా సంపుటి ప్రచురింపచేసారు. పత్రికా రంగంతో వున్న అనుభవం, సాన్నిహిత్యం కారణంగా ఈ సంపుటిలో, వర్తమాన సమాజంలోని తీరు తెన్నుల ఇతివృత్త వైవిధ్యం కవితా ప్రక్రియ రీతిలో, ప్రతిబింబిస్తోంది. శతకాలు, నానీలు, వ్యాసాలు, సమీక్షలు, సాహితీ మేఖల సాన్నిహిత్యం అంజయ్యను ఉత్తమ రచయితగా నడిపిస్తోంది. ఈ సంపుటిలో కరోనా నేపధ్యంలోని కాల వైచిత్రి, పర్యావరణం, కర్ఫ్యూనీడలు, కరోనా పాట మనల్ని నేటికీ హెచ్చరిస్తున్నాయి. చేనేతను నమ్ముకున్న జీవన వ్యధాభరిత చిత్రాలు ఆకలి చావులు, ఆత్మహత్యలు, నేత గుండె కోత, చేనేతబాల, నేసచ్చిపోతున్నా, నీకు తెలుసా..? వస్త్రశిల్పి, నేత సోదరా! మగ్గం మునిగింది 'నేతన్న బతుకుల ఆకలి', అంజయ్య వేదనా హృదయం కవితలుగా ప్రతిధ్వనించింది. చేనేత నానీలు కూడా చోటు చేసుకొన్నాయి. పత్రికలలో నందర్భానుసారంగా ప్రచురింపబడిన కవితలుగా, "నేనింక మౌనమంత్రం జపిస్తూ కూర్చోలేను" అంటూ పున్నమి ధర్మాగ్రహం వ్యక్తీకరించిన "ఆ చేతుల్ని నరకండి', దీర్ఘ కవిత 'రన్నింగ్ కామెంటరీ' సమాజ నైజాన్ని ఎదురు తిరిగి ప్రశ్నిస్తున్నాయి. 'అగ్గిపెట్టెలో ఆరుగజాల చీరను అందంగా నేసిన నేతలున్న మా ఊరు" అంటే నా కిష్టం అంటారు. కులకత్తులు, మతోన్మత్తులు జ్వలిస్తుంటే 'మనిషి పుష్పించేదెప్పుడు...'? అంటూ ప్రశ్నిస్తారు. వోంచేతి నీళ్ళు తాగుతున్న జీత, నేత, గీతగాళ్ళకు అక్షరాలు నేర్పే ఆవశ్యకత అక్షరంలో ధ్వనింపచేసారు. కాంచనపల్లి, రమణసారు, వనం ఝాన్సీ, అలీ, మిత్రుడు షణ్ముఖాచారి, డా॥ తిరునగరి స్మృతి కవితలు హృదయాన్ని కదిలిస్తాయి. గిడుగు, అన్నమయ్య, గాంధీజీ, ధర్మభిక్షం, అంబేద్కర్, గురజాడ వంటి మహనీయుల ప్రస్తావనలున్నాయి. ఈ కవితా సంపుటిలో ఉన్న 73 కవితలు ప్రత్యక్షంగా పరోక్షంగా, వర్తమాన సమాజాన్ని రేపటి కోసం భవిష్యత్ కాలగతి, ప్రగతి అభిలషించే, ప్రయోజనాన్ని ఆశించే లక్ష్యంతో పున్నమి తన కవితా హృదయాన్ని ఆవిష్కరించడం అభినందనీయం.



-జయసూర్య
సెల్:9014948336




వారి చెమట
వాగులై పారుతుంది.
అయినా బతుకుల్లో
తడికాన రాదు.



-డా॥ సూర్యాధనంజయ్
సెల్:9849104187

# సమాజ మార్పునకు చిత్రకళ దోహదం చేస్తుంది

## -ప్రముఖ చిత్రకారుడు రావూరి సుభాష్‌బాబు



సభలో ప్రసంగిస్తున్న ఏనుగు నరసింహారెడ్డి. పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న రావూరి సుభాష్‌బాబు,డా॥ఎస్.రఘు తదితరులు.

సమాజ మార్పుకు చిత్రకళ దోహదం చేస్తుందని, చిత్రకారుల కృషి చరిత్ర గతిని మారుస్తుందని ప్రముఖ చిత్రకారుడు రావూరి సుభాష్‌బాబు అన్నారు. సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో ఎల్.ఆర్. వెంకటరమణ వ్యాసాల సంపుటి కళా ప్రపంచం పుస్తకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమాజానికి చిత్రకారుల అవసరం ఉందని అన్నారు. తెలంగాణలో పోరాటాలను చిత్రప్రసాద్ బొమ్మలు రికార్డు చేశాయన్నారు. తోట వైకుంఠం, సూర్యప్రకాశ్ వంటి వారు తెలంగాణ ప్రకృతిని తమ బొమ్మల లో చూపారని అన్నారు. తెలంగాణ సాహితీ కార్యదర్శి కె.ఆనందాచారి మాట్లాడుతూ ప్రపంచ ప్రసిద్ధి చెందిన చిత్రకారులను పరిచయం చేసిన ఈ పుస్తకాన్ని కవులు, రచయితలు, కళాకారులు తప్పక చదవాలని అన్నారు.

కార్యక్రమంలో డా॥ ఏనుగు నరసింహారెడ్డి ఎస్.రఘు, కూరెళ్ల శ్రీనివాస్, డాక్టర్ రూప్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.



అనంత సాహిత్య సాంస్కృతిక వేదిక వికారాబాద్ వారం వారం నిర్వహిస్తున్న వాట్సప్ కవిసమ్మేళనంలో భాగంగా ఈ వారం 'యువజన దినోత్సవం' శీర్షికలో వచ్చిన కవితల్లో మేలైనవి కొన్ని..

నిర్వాహకులు -కమలేశ్
-దోరవేటి, అనంత వ్యవస్థాపకులు

### నమో వివేకానంద !!!

సుగతిని జూపు భారత
వసుంధరయే మతమన్ గవాక్షమై
జగతికి పంచు వేదికగ
సాదరమొప్పగ జేసికొంచు వి
శ్వ గతికి మానవత్వమె దిశన్ దశ
నెన్నిక చేయునన్న గీ
తిగ వినిపించె సర్వమత దీప్తి
యనంగ నరేంద్రు డీ యిలన్.
ధర్మమ్మన్నది సర్వమానవ
హితత్వంబై ప్రకాశించుటే
నైర్మల్యంబగు చిత్తవృత్తిని
మహానందంబుగా పంచుచున్
దుర్మార్గంబుల చక్కజేయు విధి
ప్రాదుర్భావమై వెల్గు మా
కర్మానుష్ఠిత జీవనంబనె
వివేకానందుడే స్ఫూర్తియై .
పరమోత్కృష్టము ధర్మచింతన
ప్రభావానందసంధాన మీ
శ్వరు దర్శించుట స్థావరంబులను,
జీవద్జంగమంబందులన్;
నిరతంబున్ పరిపూర్ణ మానసమునన్
నిష్కామతిన్ దానముల్,
స్థిరబుద్ధిన్ శుభకార్యముల్ సలుపుటే
శ్రేష్ఠంబు లీ జాతికిన్ !
సోదరసోదరీమణులు సొంత
మనుష్యుల కన్న మిన్న భా
గ్యోదయులంచు విశ్వజన తోన్నతి
బెంచుచు మానవత్వ ప్రే
మాదర పూర్ణుడై పలికి యందరి
డెందములన్ జయించి యా
మోదము నందె హిందు మతమున్
జగమెల్ల నెరింగి మ్రొక్కగన్ !.
యువశక్తిన్ సవరించి దేశజనతా
యోగ్యత్వమున్ బెంచి బాం
ధవుడై దీన దరిద్ర మానవుల
కాధారంబుగా నిల్చు సం
భవుడే యాతడు భారతాంబకును
విశ్వానందమున్ పెంచె తా
నవరోధంబులు లేని వాగ&ఝరి ,
వివేకానందునిన్ మ్రొక్కెదన్ !!!
-దోరవేటి

### విశ్వనరుడు

భువనేశ్వరి ప్రియనందన !
భవసాగర బంధవిముఖ భారత వీరా!
రవితేజ విరాజేంద్రా
నవ చేతన శ్రీ నరేంద్రనాథ నమస్సుల్.
భారత కీర్తికిరీటము
తారాపథమందు నిలిపి ధన్యత నొసగన్!
కారణ జన్ముడ వీవే !
ధారుణి నినుగన్నవారు ధన్యులు సుమ్మీ!.
మక్కువ మాటల తోడను
చిక్కని భాషణము తోడ చిరుహాసమ్మున్
నిక్కము జెదరక యువతను
చక్కని పౌరులుగ తీర్చు సాధువు వయ్యా!.
మమకారము దేశముపై
సమభావన పెంపు సేయు సన్యాసివిగన్
కమనీయ సూక్తు లొసగిన
హిమపర్వత శిఖరి వైన హితవరి వీవే !.
ఉక్కు పిడికిళ్ళు,ఇనుపవి
చక్కని కండరములు గల సాహసయువకుల్
నిక్కము నలుగురు దొరికిన
చక్కనొనర్చెదను భరత జాతిని యనవే !
-మహ్మద్.షరీఫ్
9866560527

### చైతన్యపు బావుటా

ఉద్యమాలలో మీరే
మాధ్యమాలలో మీరే
ఉవ్వెత్తున ఎగసిపడే
ఉదధి శృంగముల తీరే.
చెయ్యెత్తితే చాలట
చైతన్యపు బావుట
ఎగరవేసినంత పొగరు
ఎదయెదలో కొలువట.
వ్యసనాలను కోరుట
రసనాగ్రము చేరుట
భవితను చీకటి చేసి
బతుకుదారి వెతుకుట.
యువకులంటె ఒక కోట
యువతులంటె ఒక పాట
యువతలేని దేశమంటె
యుక్తి శక్తి హీనములట.
నవ సమాజ నిర్మాణము
నరనరాలలో గానము
చేయగలుగునట్లు దేశ
సేవజేయుటే ప్రాణము.
-కమలేశ్
9160396596

### శ్రీకవనాలు

వాళ్ళు పగలు
బొగ్గు గనుల్లో మండినందుకే
రాత్రి ఇంటిదీపంగా వెలిగింద్రు!.
ఆయన
కొత్త బట్టలు వేసుకున్నాడు అయిన
పాత ప్రవర్తనతోనే ఇంటికొచ్చాడు!.
వాళ్ళు రోజు
ప్రపంచాన్ని నాలుగు మడతలుగా చుట్టి
ఆకలికి అమ్ముకుంటారు!.
అలలు
అలలుగా కలలు దేహసంద్రంలో
మునిగిపోతున్నాయి!.
పుచ్చిపోయింది
నీ ప్రవర్తన
నలుగురి మనసులను మెప్పించలేక!.
మౌనంగా ఉన్న కొన్ని అక్షరాలు
మనసుదాటి
యుద్ధానికి బయలుదేరాయి!
ఆమె
గుండె గదిలోకి తొంగి చూశా
కన్నీళ్లు ఆవిరై
ధైర్యం వర్షంలా కురిసింది !
-చిగురాల్ పల్లి ప్రసాద్, పరిగి

### మణిపూసలు

రాజయోగ భక్తియోగ
వ్రాసినట్టి కర్మయోగ
స్వామి వివేకానంద
అందించిన జ్ఞానయోగ.
రామకృష్ణ ప్రియశిష్యుడు
ఆధ్యాత్మిక నాయకుండు
వేదాంత యోగతత్వము
దెల్పినట్టి తాత్వికుండు.
అద్భుత ఉపన్యాసాలు
లెక్కలేని ప్రసంగాలు
మొక్కవోని ధైర్యమున
తిరిగినారు విదేశాలు.
విశ్వమంత బ్రహ్మమని
పేదవారె పెన్నిధని
సేవ చేయమనుచు దెల్పె
జీవుడే దేవుండని.
మందలో నుండకనుచు
వందలో నుండుమనుచు
బోధించిన దివ్యమూర్తి
మనుజులంత ఒకటనుచు
-కల్లూరి ప్రభాకరాచారి

### వివేకానంద దీప్తి

అచ్చోట వినిపించె
యాత్మీయ భారతీ
సంస్కార సంగీతి సౌమ్య మూర్తి
అచ్చోట విరిసెను యమృతోదయానంద
జాతీయ భావాత్మ జలజ కొలను
అచ్చోట పొంగెను హైందవ సంస్కృతి
విజ్ఞాన జయగంగ వెల్లువెత్తి
అచ్చోట శిఖరాయ మానమై శిరమెత్తె
గంభీర వర్చస్సు కాంతులలరి.
చేతనత్వమెల్ల జీర్ణమై దేశాన
వీర శంఖ మూదె విజయ బాట
నాటె కేతనాలు నర్తించ వీరత్వ
రౌద్ర భీకరాత్మ రక్తి గట్టి.
మేల్కొల్పె నిద్రించు మేనుల తట్టియు
చైతన్య సంజీవి జార్చితాను
హారతీ బట్టెను భారతీ మాతకు
భక్తులై వర్ధిల్ల శక్తినాటి
నిద్రించు మేనుల కదిలించె ముందుకు
నరమునరములోన పరుగు దీసె
గతమెల్ల రగిలించి హితమునెంచి
పోషించె సంస్కృతి భూషింప విశ్వాన
భాషించె విందుగ భాగ్యమూర్తి.
అతని జన్మదినము కత్తులై వీరులు
కదము త్రొక్కి నట్టి క్రాంతి రోజు
గతము మరచి నట్టి
ఘనమైన సారము
-ఆకుల మల్లికార్జున్,
7416067335

### విశ్వ విజయుడు

వినీలాకాశంలో వికసించెను వీరుడై
విజ్ఞానాన్ని వివేకాన్ని విస్తరించే నరుడై
అలుపెరుగని బాటసారిలా
అవతరించి
నలుదిక్కులు చేతులెత్తి నమస్కరించేటట్టు
జాతిని సమున్నత స్థానంలో నిలిపిన
స్వామి అతడు.
మమకారం నిండిన మాటలతో
మనుషుల మనసులను
హత్తుకునే
మహనీయుడు తాను.
విశ్వ విజేతలా వికసించి
భరతజాతి ఖ్యాతిని
విశ్వమంతా విస్తుపోయేలా
విషదపరచిన వివేకవంతుడు .
యువతంటే ఇష్టమని
యువత అనుకుంటేనే విజయమని
ఎన్నెన్నో మేల్కొల్పు
పలుకులను అందించిన
చైతన్య మూర్తియే తాను.
మనస్సు నిండా జాతీయతను
మన సంస్కృతీ సంప్రదాయాల జతను
రెండు చేతులా పట్టుకుని
నిత్యం నడిచిన మూర్తిమత్వం తాను
ఒక వివేక సామ్రాజ్యం తాను
నవ యువతా ధ్వజం తాను.
-కె.రెడ్యా రాథోడ్



# ఆడపిల్ల

('మణిపూసలు' ప్రక్రియలో పెద్దపల్లి జిల్లాలోని నర్సింహులపల్లి జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలోని నర్సింహులపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 10వ తరగతి చదువుతున్న బుర్రవైష్ణవి 'ఆడపిల్ల' అంశంపై రాసిన 'మణిపూసల' శతకంనుండి...)

శ్రీకరమగు మణిపూసలు
నను దోచిన మణిపూసలు
రాయుటకు "ఆడపిల్ల
మార్గమాయె మణిపూసలు!

ఆడజన్మ లేని బతుకు
అంధకారమౌను తుదకు
అందుకే ఆడపిల్ల
తప్పక వుండాలి మనకు?

బాధ్యతను తెలిసి మెలుగు
మంచి మనసుతో వెలుగు
అవనిలోన ఆడపిల్ల
ఉంటేనే సిరులు కలుగు!

లోకములో గొప్పదెపుడు
తక్కువగాను కాదెపుడు
అవనికే ఆడపిల్ల
అండగాను నిలుచునెపుడు!

తాగుబోతు భర్తను
అత్త పెట్టె బాధను
సహనంతో ఆడపిల్ల
ఓర్చుకొను భారమును!

స్త్రీలకున్న విలువనెపుడు
తెలుసుకోని మసలినపుడు
పురుషులకు ఆడపిల్ల
వలన శుభం గలుగునపుడు!

భర్త బాగోగులను
పిల్లల బాధ్యతలను
ఓర్పుతో ఆడపిల్ల
చక్కగా చూసుకొను!

రుచిగాను వంటలు వండు
ప్రేమగాను పెడుతునుండు
ఇలవేల్పు ఆడపిల్ల
చేతిలోన మాయ వుండు!

ప్రతిభను కలిగి వుండు
అణుకువతోడ నుండు
గొప్పదెపుడు ఆడపిల్ల
వెలుతురు నిచ్చుచుండు!

ఆడపిల్ల పుట్టెను
సంబురమే తెచ్చెను
ఇంటిలోన ఆడపిల్ల
దేవతలా వుండును!

కాళ్లకు పట్టీలను
చెవులకూ కమ్మలను
పెట్టుకొని ఆడపిల్ల
అందముగా నుండును

ఇంటిలోన కూరలెపుడు
రుచికి మంచిగాను వండు
అందరిలో ఆడపిల్ల
జింకలాగ తిరుగుతుండు

చదువుపైన శ్రద్ధను
ఆటలో ఇష్టమును
మరవలేదు ఆడపిల్ల
ఎన్నిరోజులైనను

అమ్మ మీద ప్రేమను
నాన్న మీద మమతను
కురిపించును ఆడపిల్ల
అన్నివేళలందును!

అన్ని రంగాలలోన
ఎంతగ ఆరితేరిన
పురుషులందు ఆడపిల్ల
చిన్నగానే తెలిసెన?

కడుపులోని పాపలను
పుట్టకముందె జంపును
ఎందుకింత ఆడపిల్ల
మీదను కోపముండును

కన్న తల్లె శిశువును
కాల్వలో పడేసెను
ఘోరమిది ఆడపిల్ల
బతుకు భారమవ్వును

ఏవిధంగ గొప్పదవును
ఎప్పుడు మన యవనిలోను
ఇంకెప్పుడు ఆడపిల్ల
ఇంటికి దేవతగవ్వును

డబ్బాశ కోసమును
డాక్టర్లు పాపమును
చేసెదరు ఆడపిల్ల
విలువ యెట్లు పెరుగును?

మార్పులు ఎప్పుడు వచ్చును
ఈ మానవ జాతిలోను
కష్టపడే ఆడపిల్ల
జీవితమెప్పుడు మారెను!

స్త్రీలకంటే పురుషులను
మంచిగా చూసుకున్నను
కన్నవారె ఆడపిల్ల
ఇక పనికిరాదనుకునును

ఒక పట్టుబడితేను
సాధించే వరకును
వదలదు ఆడపిల్ల
ఎందులోన నైనను

బాల్యపు పెళ్లి చేసెదరు
అత్తారింటి కంపుదురు
పనిలేదని ఆడపిల్ల
ను, అవమాన పరిచేదరు

ఆడపిల్ల పుట్టిందని
అత్తపోరు పెట్టిందని
దుఃఖపడును ఆడపిల్ల
కంట్లో నీరు దాచుకొని!

అత్త కష్టాలు పెట్టును
గర్వమునెంతో చూపును
అత్తకుడా ఆడపిల్ల
అని తెలుసుకోక పోయెను!

బ్రతుకనివ్వరు స్త్రీలను
బ్రతికినంత కాలమును
ఏడ్పి ఏడ్పి ఆడపిల్ల
కన్నీరింకిపోవును!

చదువుకు పంపకపోయిరి
ఇంట్లో పని చెయ్యమనిరి
ఆడపిల్ల నెదుగకుండ
వంటిట్లో బంధించిరి

ఆడపిల్లంటె ఎందుకు
కోపము వస్తుంది మీకు
ఏమిజేసె ఆడపిల్ల
దునియలోన తప్పు మీకు?

ఆదిశక్తి రూపముగ
ఇంటి ఇలవేల్పులాగ
కనిపించును ఆడపిల్ల
మనసు నిండుగ కొలువగ!

ఆడపిల్లలు లేకున్న
సృష్టి నడువదు ఓరన్న
ఇలపైన ఆడపిల్ల
కాంతిపంచును మాయన్న!

పాపపుణ్యములు లేక
పసి మొగ్గలని చూడక
చెరచబడెను ఆడపిల్ల
కనికరమింత చూపక!

చేతులకు పెట్టుకొనును
గోరింటాకు రంగును
అది పండితే ఆడపిల్ల
ఏంతో మురిసిపోవును!

చదువు బాగ చదువవలెను
ఉన్నతంగ ఎదుగవలెను
అవనిలోన ఆడపిల్ల
హాయిగాను బత్కవలెను!

అత్తపైన గౌరవమును
కోడలుగా కలిగుండును
భయముతో ఆడపిల్ల
నోరును విప్పక పోవును!

జైలు వలెను ఇల్లాయెను
ఎప్పుడు పనులే వుండును
కడపదాటి ఆడపిల్ల
తిరిగిన కష్టం వచ్చును!

కలిసి మెలిసి తిరుగుతున్న
చెలిమి సిరులు పెరుగురన్న
కానీ మన ఆడపిల్ల
భయముతోనే బతుకునన్న!

చదువును బాగా చదువును
బుద్ధిని యెంతో పొందును
పుట్టుకతో ఆడపిల్ల
లక్ష్మి కళను కలిగుండును!




బాలికలందరితోడను
బతుకమ్మల ఆటాడెను
చెలిమి కొరకు ఆడపిల్ల
అందరితో గూడుండెను!

అమ్మ మాటను కాదనదు
నాన్న మాటను వద్దనదు
గతములో ఆడపిల్ల
పెద్దల మాటను తియ్యదు!

సంప్రదాయమును నడుపును
సంస్కృతిని చాటిచెప్పును
ఎక్కడైనా ఆడపిల్ల
మన ఘనత తెలియ జేయును!

కన్నవారి కలల కొరకు
బంగారు భవిష్యత్తుకు
కొనసాగును ఆడపిల్ల
తన లక్ష్య సాధనకొరకు!

అందమైన ప్రేమను
అందరికీ పంచును
అయినగాని ఆడపిల్ల
చులకనయ్యి పోయెను!

ఇల్లు చూసి ఇల్లాలును
చూశారు పెద్దవారును
శుభ్రపర్చును ఆడపిల్ల
నివసించెడి తన ఇల్లును!

అయ్యో పాపమనుకోరు
అన్ని పనులను చెబుతారు
గృహములోన ఆడపిల్ల
పనికిరాదనుకుంటారు!

మెట్టింటి మంచి కోరును
పుట్టింటిని కాపాడును
కష్టమొస్తె ఆడపిల్ల
అందరికీ సాయపడును!

కన్నవారలను వదిలి
అత్తారింటికి వెడలి
పెళ్ళైన ఆడపిల్ల
ఏడ్చునుగ కుమిలి కుమిలి!

కోతిపని జేసె కొడుకును
దుర్బుద్ధియె మెచ్చుకొనును
ఏం తెలియని ఆడపిల్ల
బతుకు బుగ్గిపాలయ్యెను!

కష్టాలను పెట్టరాదు
నష్టము కలిగించరాదు
అవనిలోన ఆడపిల్ల
కన్నీటిని కార్చరాదు!

పొద్దున్నే లేచును
వాకిలినే ఊడ్చును
ఇంటి ముందు ఆడపిల్ల
ముగ్గులనే వేయును!

అమ్మపైన ప్రేముండును
బిడ్డపైన మమతుండును
సృష్టిలోన ఆడపిల్ల
వుంటేనే జగతుండును!

ముసలివారి నైనను
బంధుగణము నైనను
గౌరవించు, ఆడపిల్ల
అవిటిజనుల నైనను!

ఇంటిపనులు సేయును
ఉద్యోగము సేయును
అయినను ఆడపిల్ల
హుందాగా వుండును!

మన ఇంటికి దీపమై
మన ప్రేమకు రూపమై
నిలుస్తుంది ఆడపిల్ల
మన వంశపు మూలమై!

ఆడది లేని జీవితము
ఆగమ్యమగు గోచరము
అందుకే ఆడపిల్ల
అవును కదా సర్వస్వము!

ఏ ఆపద వచ్చిన
ఎంత కష్టమొచ్చిన
ధైర్యముతో ఆడపిల్ల
ఎదురీదునెపుడైన!

భానుడి కిరణాల వలెను
నిత్యం వెలుగులు పంచును
జగతిలోన ఆడపిల్ల
చంద్రుని వెన్నెల నిచ్చును!

జన్మకు కారణమవ్వును
సృష్టికి జీవం బోయును
లోకములో ఆడపిల్ల
మార్గదర్శిగా నిలుచును!

నొప్పులను ఓర్చుకొనె
బాధలను తట్టుకునె
సృష్టిలోన ఆడపిల్ల
మాతృమూర్తి అయ్యెనె!

తన తండ్రి కెప్పుడును
చిన్న చూపు ఉండును
ఐనగాని ఆడపిల్ల
భయముతోనే బతుకును!

ముక్కునకు ముక్కెరను
నుదుట బొట్టు పెట్టును
చీరకట్టి ఆడపిల్ల
దేవత వలె నుండును

మాటలతో హింసించిన
మనసును గాయం జేసిన
శాంతమూర్తి ఆడపిల్ల
దాచుకొనును తనదు యెదన!

మగశిశువు జన్మిస్తెను
మురిసిపోదు రందరును
అదే గనుక ఆడపిల్ల
పుడితే గొనుగుతరిలను!

తెలివి తేటల్లోన
అట పాటల్లోన
ఆరితేరి ఆడపిల్ల
అలరించు నెపుడైన!

మామ మీద చూపించును
ఎంతో మమకారమ్మును
ఏమైన ఆడపిల్ల
చెప్పినట్టుగానె వినును!

భర్తపై కురిపించును
వెలకట్టని ప్రేమలను
పెళ్ళైన ఆడపిల్ల
భర్తే దైవమనుకొను!

బిడ్డలపై చూపును
వాత్సల్యపు వెలుగును
మాతృమూర్తి ఆడపిల్ల
మమతల నొలికించెను!

భర్తయే తన జీవితము
భర్తయే తనకు లోకము
పెళ్లి పిదప ఆడపిల్ల
కోరికలను చంపుకొనును!

ఎంతో స్నేహముగుండును
ఎంతో బలమ్ముగ నుండు
ఎప్పుడైన ఆడపిల్ల
ఎంతో నిజాయితిగుండు!

కుటుంబమే ప్రాణము
కుటుంబమే లోకము
ఏమైనా ఆడపిల్ల
ప్రగతికి ఆధారము!

భూదేవికున్నట్లును
సహనమెంతో ఉండును
ఇలలోన ఆడపిల్ల
ఓరిమితోడ యుండును!

కన్నవారి ప్రేమను
పుట్టినూరు మమతను
మరవలేదు ఆడపిల్ల
ఎక్కడికి వెళ్లినను!

బాలికల విద్యయగు
కుటుంబానికి వెలుగు
బడికి వెళ్లి ఆడపిల్ల
చదివితెనె గొప్పదగు!

పాటలను బాగ పాడును
విన్నచో హాయిగుండును
కోయిల వలె ఆడపిల్ల
గొంతు తియ్యగా నుండును!

కడుపులోపల బిడ్డలను
కడతేర్చగ జగతిలోను
కడదాక ఆడపిల్ల
కష్టం జీవించుటకును!

ఆటపాటలని తిరుగును
ఇష్టముతో పని చేయును
అందరితో ఆడపిల్ల
మంచి మనసుతో నుండును!

తెలియని వయస్సులోన
పెద్దలు పెళ్లి చేసిన
కరుణ లేక ఆడపిల్ల
కసురుకోలేదు యిలన!

పనిలో భారమైనను
కనబడనీదు బాధను
జరమొచ్చిన ఆడపిల్ల
తనపని తాను చేయును!

మామ మురిసిపోయెను
మనుమడిని చూసినను
ఏమైనా ఆడపిల్ల
ఇష్టపడక పోయెను!

కొడుకు కొరివి పెట్టును
బిడ్డ యేమి జేయును
అనుకుంటె ఆడపిల్ల
నిరాశలో మునుగును!

కొడుకులను తియ్యగ పిలిచి
బిడ్డలనే మందలించి
పేరు తెచ్చు ఆడపిల్ల
అంతటను మంచిని నిలిచి!

పసిగుడ్డు పాపలను
కుక్కలు పీక్క తినెను
జగతిలోన ఆడపిల్ల
భవిత లేక పాయెను!

తల్లిగాను, చెల్లిగాను
భార్యగాను, బిడ్డగాను
ఇలలోన ఆడపిల్ల
బహువిధాల్లో కనబడును!

పుత్రులకు ఆస్తి నిస్తరు
బిడ్డలకు పెళ్లి చేస్తరు
అయినను ఆడపిల్ల
ను, ఎందుకిట్ల చూసెదరు!

కొడుకును ప్రైవేట్ బడిలో
బిడ్డను సర్కార్ బడిలో
చదివించి ఆడపిల్ల
ను, వేరు చేసిరి యిలలో!

అమ్మానాన్నలెపుడు
రెండు కండ్లయి యుండు
అందుకే ఆడపిల్ల
వారిని మరువదెపుడు!

ఎన్నో నిందలు పడిన
ఓర్చుకొను భాధతోన
భువిలోన ఆడపిల్ల
నిలుచును సహనంతోన

మంచి మనసు కలిగుండును
పరులకు మేలును చేయును
అందరితో ఆడపిల్ల
ఎంతో మెప్పును పొందును!

బుడి బుడి నడకలతో
నవ్వించును యెంతో
చిన్నపుడు ఆడపిల్ల
ముద్దుగొలుపు నెంతో!

కష్టాలను సుఖాలను
సమ దృష్టితో చూసును
ధైర్యముతో ఆడపిల్ల
అన్నిటిని ఎదుర్కొనును!

చెట్టులా నీడనిచ్చు
గాలిలా ఊపిరిచ్చు
అందరికీ ఆడపిల్ల
అమ్మలా జన్మనిచ్చు!

మృదువైన మనసుతోను
మమత నెంతో పంచును
గొప్పదగు ఆడపిల్ల
మంచి వైపున నిలుచును!

కడుపును చంపుకొని తాను
తినక బిడ్డలకు పెట్టును
అమ్మగా ఆడపిల్ల
ఎన్నో సేవలు సేయును!

ఆడపిల్ల నవ్వులే
లోకానికి వెలుగులే
కలకాలం ఆడపిల్ల
నవ్వులే విరియవలే!

క్రమశిక్షణతో మెలుగును
ఉన్నత చదువులు చదువును
బడిలోన ఆడపిల్ల
గురువులకు పేరు తెచ్చును!

జాలెంతో చూపును
ప్రేమతోడ మెలుగును
సహజంగా ఆడపిల్ల
దయాగుణం వుండును!

సంక్రాంతి పండుగలకును
ముగ్గులనెన్నో వేయును
ఇంటిలోన ఆడపిల్ల
ఎన్నో వంటలు చేయును!

ఆడపిల్ల లేని బతుకు
అవుతుందది గుడ్డిబతుకు
దారి చూపు ఆడపిల్ల
వెలుగు పంచును ఎల్లరకు!

బొమ్మలాట భలే ముద్దు
పసితనపు పెళ్ళి వద్దు
అని కోరెను ఆడపిల్ల
ఆశలకుండాలి హద్దు!

చంకలోన పాపను
నెత్తిమీద మూటను
పెట్టుకొని ఆడపిల్ల
అన్ని పనులు చేయును!

గోరు ముద్దలను పెట్టును
వేలకు కడుపును నింపును
జోల పాడి, ఆడపిల్ల
బిడ్డను నిద్దుర బుచ్చును!

ఆడపిల్ల కష్టాలు
అవనికే తలవంపులు
ఏమిజేయు ఆడపిల్ల
తొలగాలి తన బాధలు!

ఆటపై శ్రద్ధ చూపును
పాటకై గొంతు గల్పును
తోడుంటే ఆడపిల్ల
అన్నిట్లో రాణించును!

ప్రధానిగా వెలుగొందే
రాష్ట్రపతి పదవి పొందే
ఆటలలో ఆడపిల్ల
పతకాలను గెలుపొందే!

అంతరిక్షముకు వెళ్లెను
ఆ విమానమును నడిపెను
గగనములో ఆడపిల్ల
చుక్కలా మెరిసి పోయెను!

ముక్కుకు పుడక పెట్టును
జడన పువ్వులు పెట్టును
వాస్తవంగ ఆడపిల్ల
ఉన్నది సరి పెట్టుకొను

చేతులకు గాజులను
కాళ్లకు పట్టీలను
పెట్టుకొని, ఆడపిల్ల
మన సంస్కృతి నిలుపును!

కండ్లకు కాటుక పెట్టును
నెత్తిన పాపట తీయును
బడికెళ్లగ ఆడపిల్ల
శుభ్రంగా తయారవును!

ఆడపిల్ల నవ్వెను
అందంగా వుండెను
జగతిలోన ఆడపిల్ల
మణిపూసై మెరిసెను!

–బుర్ర వైష్ణవి,
10 వ తరగతి,
జి.ప.ఉ.పా. నర్సింహులపల్లి,
పెద్దపల్లి జిల్లా.

## తేనీటి విందు

ఆకాశ స్నానానికి నోచుకొని
పూదోటలో పూచి
పచ్చని తోరణాలను పరిచి
అవని పై ఎదిగిన తేయాకులు.

కప్పులో కలివిడిగా
పాలపొంగులో జలకాలలాడుతూ
రంగు రుచి వాసనతో
సిప్పు సిప్పులో వేడిగా
మనసు ఉల్లాసానికి హాయిగా.

గొంతునదిలో జారుతుండగా
ప్రశాంతతను చేకూర్చే
దివ్యౌషధం 'టీ'.

చలిబాధను వదిలించే వేడి శ్వాస
పరిచయాల పలకరింపును
మొదటి భాష
తనువుల వణుకునకు వేడిదోస్తీ
మిత్రులను దగ్గరగా చేసే
టీ మందు
ఆత్మీయులను పలకరించే
తేనీటి విందు.

చుక్క చుక్కలో కిక్కు
తేనీటి కప్పుతో
హృదయం పులకించు



–డాక్టర్ పగిడిపల్లి
సురేందరు
807484603

## కమూరు వాసన

అప్పుడెప్పుడో చూసిన కళ్ళు
అక్కడెక్కడో కలిపిన మాటలు
ఎక్కడెక్కడో వేసిన అడుగులు
గుర్తుకొస్తుంటే ఊపిరి ఉరికొయ్యకు
ఊగినట్టు అనిపిస్తుంది!!

నీ అడుగుల సవ్వడి
నీ మాటల అలికిడి
నీ స్పర్శ తాకిడి
ఊహకు అందని జ్ఞాపకాలు
నా గుండెల మీద
నిప్పుల వర్షం కురుస్తున్నట్టున్నది
నా బతుకు మీద
నిప్పు కణికలతో
కాలుస్తున్నటుంది !!
నువ్వు కురిపించిన ప్రేమ
హృదయానికి హత్తుకున్న స్మృతులు
ప్రేమాగ్నిలో
కాలి కాలి
కరిగి కరిగి
పొడి పొడిగా
రాలుతున్న పుప్పొడిలా
నా హృది భస్మమై
పుడమిలో కలిసిపోతున్నట్టు ఉంది
నా దేహానికి స్పర్శ లేదు కానీ
ఉన్న ఊపిరి శ్వాస మాత్రం
మృతప్రేమ
కమురు వాసనలా ఉంది !!



–లక్ష్మీ శ్రీనివాస్
9676601192

## శీతల లేపనం

పద లయలోనే ఎద గదిని
రసమయం చేసే మధు రవళి.

ఊహా మాత్రం గానే మనసు గనిలోని
మణులను వెలికితీసే
ఆనంద ధుని...

అనంత తిమిర తీరాలను దూరాలకు
తరిమే అమృత శాంతి
పవనం చెలిమి.

అంతులేని
సంకట కంటకాల దారిలో
అమృతనపు శీతల లేపనం ఇది.

చెలిమి భగవంతుని చిరునవ్వుకు
ప్రతిరూపం
చెలిమే సృష్టి కళలు అణువణువున
నింపుకున్న నవ రూపం...

ఒక్క నేస్తం చాలదా
అందించిన చేయి తో
ఆపదల కంపనాలను
ఆమడ దూరం తరమడానికి.

కలిమినీ లేమినీ లెక్కించని అచ్చమైన
ఆత్మీయ ధ్వని.

చినుకై కురిసి నదియై కదిలి
జీవన వనాన్ని హరిత భరితంగా
నిలిపే కమనీయ కానుక చెలిమి.

తెలియని చింతల చీడను చికాకుల
పీడను చిటికెలో
హరించే పచ్చని వేడుక
చెలిమి.



–వెల్మల జయపాల్ రెడ్డి
9441168976

## నాగన్న పదాలు

పెంట వలన పంట
పంట వలనే వంట
వంట తీర్చెను మంట
ఓరి! నాగన్న

అందమైనది ముగ్ధ
సమత కోరి స్నిగ్ధ
మమత కరువై దుగ్ధ
ఓరి! నాగన్న

చెట్లు పెట్టెను ఇగురు
కోకిల మెక్కె చిగురు
పొలతి కేల పొగరు
ఓరి! నాగన్న



–నెమలికొండ నాగేశ్వర్ రావు
8688553470

పుస్తక సమీక్ష

# శ్రీ మదాంధ్రభాగవత సూక్తులు-భూజనావళికి మార్గదర్శకాలు.






సంస్కృత భాగవతము తత్త్వరహస్య గర్భితము, ప్రౌఢభాషాబంధురము అగుటచే సంస్కృత విద్వాంసులకే గాని సామాన్యులకు, అందునా సంస్కృత భాషాజ్ఞానం లేనివారికి అవగతంకావడం కష్టం.

తెలుగువారిఅదృష్టమో, వారిపూర్వజన్మ సుకృతమో గాని లోకోత్తరమగు శ్రీమమద్భాగతమును సహజ పాండిత్యశోభితుడు, మృదుమధుర కవితావిరాజితుడు, శ్రీ రామభక్తుడునగు శ్రీ బమ్మెర పోతనామాత్యుడు సలలితముగ, భక్తి రసాత్మకంగా తెలిగించి తెలుగుప్రజల ఆదరాభిమానాలకు పాత్రుడైనాడు.

భాగవతం లోని ఏఒక్క పద్యమైన వినని తెలుగు వారు లేరనడం అతిశయోక్తి కానేరదు.

భాగవతం నిండా భాగవతుల యొక్క గాథలే కనబడతాయి..భక్తునికి భగవంతునికి గల సంబంధం, భక్తులను పరీక్షించిన తీరు వారితో మమేకమై వారికి ముక్తిని ప్రసాదించిన ఉదంతాలు కనిపిస్తాయి.

వేద వాఙ్మయము వలనే పురాణ వాఙ్మయమును ప్రాచీన భారతీయసంస్కృతికి పట్టుకొమ్మయని చెప్పవచ్చును .వేదముల సారమంతయు తర్వాతి కాలమున పురాణ రూపమున ప్రవచింపబడినదని ఊహించవచ్చును. నిగమ కల్పతరు గళితమైన ఫలము భాగవతం. వైకుంఠ గతమైన దానిని నారదుడు కొనివచ్చి వ్యాసును కొసంగెను వ్యాసుడు దానిని శుకముఖ నిహిత మొనర్చెను. అమృత ద్రవ సమ్మితమై యది శుకముఖము నుండి భూమి పై రాలినది. ఆరస ముము గ్రోలువారికి పరమానం దానుభవము తథ్యము. భాగవతము మోక్ష శాస్త్రం అదే భగవద్రూపమైనది కలియుగ మున దానిని పఠించినను విన్నను కైవల్య ప్రాప్తి కలుగునని భక్తుల విశ్వాసం.

వేదాంత శ్రవణ గీతా పారాయణ ములచేగూడా లభించని భక్తి జ్ఞాన వైరాగ్యములు భాగవత శ్రవణముచే తప్పక లభించి మోక్ష ప్రాప్తి కలుగునని పెద్దల అభిప్రాయం.

**నిగమములువేయింజదివిన**
**సుగమంబులుగావు ముక్తి సుభగత్వంబుల్,**
**సుగమంబు భాగతమను**
**నిగమంబు పఠించ ముక్తి నివసనము బుధా..!**

పోతనామాత్యుడు తెనిగించిన భాగవతము మనోహరమగు కల్పనలతో హృదయానంద కరములగు శబ్దాలంకారములతో, సముచిత సమాసములతో అంత్యనియమములతోడను, భక్తిరసోద్బోధకమై ఆనంద పారవశ్యమును గూర్చు చుండును.

అట్టి భాగవతం లోని సూక్తులను ఒకచోట గుదిగూర్చి వాటికి తోడుగా అనేకములైన ఆధ్యాత్మిక విషయాలను పాఠకులముందుంచారు మధురకవి డా.బెజుగామ రామమూర్తి గారు

భాగవతం అంటే భాగవతుల గాధలు తెలిపేది.భాగవతం భక్తి రసప్రధానమైన పురాణమైనప్పటికి జనులందరి జీవన సాఫల్యానికి, ఉపయుక్తమైన ఆచరణ యోగ్యమైన సూక్తులతోపాటు మోక్షసిద్ధికి కావలసిన భక్తి,జ్ఞానం ఈ గ్రంథంలో కనిపిస్తుంది. సందర్భానుసారంగా, ప్రసంగ వశాత్తు అనేక స్కంధాలలో ఎన్నెన్నో సూక్తులు ఇందులో చోటుచేసుకున్నాయి.

ఈ సూక్తులు ధర్మానుష్ఠానికి,ఉత్తమ సంస్కారం పొందడానికి అన్నివర్గాల ప్రజలకు మార్గదర్శకంగా నిలుస్తాయి.

**"పరహితము సేయునెవ్వడు**
**పరహితిండగును భూత పంచకములకున్**
**బరహితమె పరమధర్మము**
**పరహితునకెదురులేదు పర్వేందు ముఖీ..!"**

హాలాహలసేవనానికి ముందు శివుడు పార్వతి తో పరహితముకన్న మేలైన ఉత్తమ ధర్మం లేదని, పరోపకారికి ఎదురు లేదని చెప్పిన సూక్తి ఈ భాగవతం లోనిదే..

భాగవతం అనే మహాసాగరాన్ని మథించి అమూల్యమైన, ప్రజోపయోగ మైన సూక్తులను వెలికితీసి "శ్రీ మదాంధ్ర భాగవతంలో సూక్తులు" అను గ్రంథంలో పొందుపరచి పాఠకలోకాని కందించారు మధుర కవి డా.బెజుగామ రామమూర్తి గారు.

వీరు తమ గ్రంథాన్ని ఐదు అధ్యాయలుగా విభజించి మొదటి అధ్యాయంలో తెలుగు సాహిత్యం,పురాణాల్లో భాగవతం, పోతన భాగవతం.. అసలు భాగవతం అంటే ఏమిటి మొదలగు అనేక అంశాలను విస్తృతంగా రేఖాసూచికలతో వివరించారు.తెలుగుసాహిత్యం అందులో వాఙ్మయం,సారస్వతం వాటిలో వివిధ రీతులు,

పోతన భాగవతం లోని విశిష్టత,భగవల్లీలా విశేషాలను,అష్టాదశపురాణాలను వాటిలక్షణాలను పాఠకులకు పరిచయం చేసారు.ఇక రెండవ అధ్యాయంలో సూక్తులయొక్క ప్రస్తావన, ప్రామాణికంగాసూక్తి యొక్క నిర్వచనం,సూక్తి పరంపరలను,పోతనకంటే పూర్వకవుల రచనలలో చోటుచేసుకున్నసూక్తులను సోదాహరణంగా వివరిస్తూ వాటియొక్క ప్రాధాన్యతలనుపాఠకులకు కరతలామలకం చేసారు. వేదాలలోని సూక్తులు, లోకవ్యవహారంలో తరచుగా వింటున్న సూక్తులగురించి రెండవ అధ్యాయంలోవివరించారు. తదుపరి మూడు అధ్యాయాలలో భాగవతంలోని సూక్తులను వాటి వాటి గుణవిశేషాలను బట్టి ఒక క్రమపద్ధతిలో వర్గీకరించి పురుషార్థసూక్తులుగా, భక్తిస్ఫురణ సూక్తులుగా, ఆధ్యాత్మిక సూక్తులుగా,సామాజిక సూక్తులుగా అవి ఏయే సందర్భాలలో ,ఎవరెవరి ద్వారా ప్రకటించ బడినాయో వాటియొక్క సారాంశాన్ని చక్కగా వివరిస్తూ మనముందుంచారు శ్రీ రామమూర్తి గారు.

ఇందులో తరచుగా మనవాడుకలో వినబడుచున్న,అనేక సందర్భాలలో పెద్దల ముఖతా వెలుబడుచున్న అనేక సూక్తులను గమనించ వచ్చును..

**"వారిజాక్షులందు.. వొందదధివ".** (పు.సం.40)

సామాజిక అంశము ఇందులో చోటు చేసుకుంది.రాక్షస గురువైన శుక్రాచార్యులనుండి వెలుబడిన ఈసూక్తి ఇప్పటికీ అందరి నోళ్ళలో నానుతూనే ఉంది.

విద్యయొక్క ప్రాముఖ్యత గురించి తెలిపే అమూల్యమైన పద్యం రాక్షసరాజైన హిరణ్యకశిపుని నుండి వెలుబడడం గమనార్హం..

**"చదువని వాడజ్ఞుండగు...చదువుము తండ్రీ."** (పు.సం.44)

అయా కథాగమన సన్నివేశాలను బట్టి జీవన గమనానికి సరియగు మార్గదర్శకాలు గా నిలిచే అమూల్యమైన సుభాషిత రత్నాలు కోకొల్లలుగా భాగవతం లో మనకు కనిపిస్తాయి.

పురుషార్థ సాధనకు మూలము హరిపద ధ్యానమే నంటూ నారదుడు ధ్రువునికి ఉపదేశించన సూక్తి ధార్మిక పరమగు సుక్తిగా మనం భావించ వచ్చును.

**"పురుషుడు....నన్యము గలదే."** (పుట సం.44)

**"జనపతులార..జిరాయురున్నతుల్.".** (45)

**"ఉపవాసంబుల దయ్యుటో..సంసిద్ధులే."** (49)

**"పార్థివోత్తములకుం..దానను భవించు"** (57)

**"జనులకు..నందున్.".** (58)

**"వెఱచినవాని దైన్యమున...ధర్మము గాదు ఫల్గుణా..!"** (62)

**"వదలకభూజనావళికి...నెట్లటరిగింతు రిమ్ములన్..!"** (64)

**"భూమికిధనదాన్యములకు.. చెనకుదు రొరులన్."** (78)

"చెలియే మృత్యువు...ధర్మాది నిర్ముక్తుడై.". (151)

**"లోకములన్నియున్ గడియలోన.. దానవేశ్వరా. "** (173)

**"చేతులారంగ శివుని...కడుపుచేటు.".** (244)

**"భూతములకెగ్గు సేసిన...శుభము పొందదధీశా..!"** (261)

కేవలం సూక్తులే కాకుండా ఆ యా సందర్భాలలో చోటుచేసుకున్న లోక ప్రసిద్ధమైన, శబ్దాలంకార శోభితమైన, భక్తి భావ గర్భితమైన అనేకానేక పద్యాలను వాటియొక్క భావార్థాలను వివరించినతీరు భాగవతాన్ని సామాన్య పాఠకులకు మరీదగ్గరగా చేరుస్తుంది అనడంలో సందేహము లేదు..

వీటికి ఉదాహరణలుగా సందర్భావసరముల బట్టి పునరావృతమైనను అనేక పద్యాలను ఉదహరించి గ్రంథాన్ని రసరమ్యం చేసారు శ్రీ రామమూర్తి గారు.

వివిధ ఘట్టాలలోని పద్యాలు.వీటిలో సూక్తులు, భక్తి,తాత్వికత,జీవనోపయోగ,సామాజిక అంశాలు దర్శన మిస్తాయి.

### గజేంద్ర మోక్షం.

**"ఎవ్వనిచే జనించు జగము...వేదెదన్.".** **(39)**

**"లావొక్కింతయు లేదు ధైర్యము విలోలంబయ్యె..భద్రాత్మకా.".** **(39)**

**"పాద ద్వంద్వము మోపి...పాదాక్రాంత నిర్వక్రమై."(195)**

### ప్రహ్లాదుడు.

**"తనుహృద్భాషల సఖ్యమున్..దైత్యోత్తమా.".** **(89)**

**"కమలాక్షునర్చించు...పశువుగాక".** **(103)**

**"కంజాక్షునకుగాని... చదువుచదువు.". (106)**

**"సంసార జీవుల తత్ సంఘంబు...దానవేంద్ర.". (106)**

**"లోకంబులన్నియున్ గడియలోన...దానవేశ్వరా.". (173)**

**"లోకంబులు లోకేశులు..సేవింతున్." (220)**

### వామనుడు - బలిచక్రవర్తి.

**"వసుధాఖండమువేడుచో..నీ నేర్చునే." (142)**

**"కారేరాజులు రాజ్యముల్ గలుగవే...భార్గవా." (61,145)**

**"ఆదిన్ శ్రీ సతికొప్పుపై....కాయంబునాపాయమే.". (145)**

**"వేంరువుతలక్రిందైనను.. తప్పకయిత్తున్." (146)**

**"బద్ధుండై.....బుణ్యుండితండల్పుడే.". (153)**

**"ఊరకరారుమహాత్ములు...నిజము మహాత్మా." (153)**

**"ఇంతింతై వటుడింతయై.. సంవర్ధియై.". (260)**

**"రవిబింబంబువమింవ.. బ్రహ్మాండమున్ నిండుచోన్. " (260)**

### యశోద.

"కలయో వైష్ణవ మాయయో... చింతింపగన్." (263)

### గోపికలు.

"నల్లనివాడు...చెప్పరే.". (43)

### కుంతీదేవి.

"శ్రీకృష్ణాయదుభూషణా... నిత్యాను కంపానిధీ." (81)

### భీష్మస్తుతి.

**"ఆలాపంబులుమాని...శ్రీ హరిన్."**

**"త్రిజగన్మోహననీలకాంతి... నెల్లప్పుడున్.".**

**"హయరింఖాముఖ ధూళిదూసర... అశ్రాంతమున్.". (101)**

**"తనకున్ భృత్యుదు..ప్రశంసించెదన్."(138)**

**"ఒక సూర్యుండు సమస్తజీవులకు... శుద్ధుండనై." (102)**

**రుక్మిణీ కల్యాణం.**

**"ప్రాణేశ....జన్మజన్మములకు." (108)**

**"నమ్మితి నామనంబున... యీశ్వరీ.". (110)**

**"పురుషాధీశ..మ్రొక్కెదన్." (113)**

**"ధ్రువకీర్తిన్ హరి బెండ్లియాడె... రుక్మిణిన్." (111)**

తేనియలొల్కు తీయని తెలుగు పద్యాలతో రుచులూరు భాగవతాన్ని పూర్తిగా నిమగ్నమై అందులో తాదాత్మ్యం చెందితే గాని అందులో గల అనేకములైన సూక్తులను ఆకళింపు చేసుకొని పాఠకులకం దిండం సాధ్యంకాదు. అంతే కాక అందులో నిబిడీకృతమైన అనేక అధ్యాత్మిక అంశాలను వాటికి సంబంధిం చిన అనేక అనుబంధ విషయాలను అనేక ఇతర గ్రంథాలనుండి గ్రహించి మన ముందుం చారు.ఈ ఒక్క గ్రంథాన్ని చదివితే భాగవతాన్ని..ఇతర గ్రంథాలను చదివితే కలుగు పుణ్యఫలాన్ని పాఠకులు పొందే అవకాశం పుష్కలంగా లభిస్తుంది. ఈపుస్తకం నా ఆధ్యాత్మిక అవగా హనను మరింత పెంచి మహోపకారం చేసింది.

భాగవతాన్ని చదివినా విన్నా కలిగే పుణ్యం శ్రీ రామమూర్తి గ్రంథం చదివినా అంతే పుణ్యం లభిస్తుంది. మోక్షప్రాప్తికి మార్గం సుగమమౌతుంది.

ఇంతటి పుణ్య ప్రదమైన గంథాన్ని అందించిన మధుర కవి, అష్టావధాని డా॥ బెజుగామ రామమూర్తి ధన్యులు.

### ఉత్పలమాల.

**భక్తిరసాలవాలమగు భాగవతమ్మున నున్నభవ్యమౌ**
**సూక్తుల నన్నిటిన్ వెదికి సుందర రీతిన పాఠకాళికిన్**
**యుక్తమటంచునెంచి మది యోచన చేసిన రామమూర్తి కిన్**
**ముక్తిపథానుకూలమగు పుణ్యము దక్కును నిశ్చయమ్ముగన్.**

ప్రతులకు:
డా॥బెజుగామ రామమూర్తి
లతారామం, ఇ.నెం.5-8-999/18
శ్రీనివాసనగర్ కాలని
కామారెడ్డి-503111
8019138207



-మంద పీతాంబర్
9848451892

## చెదిరిపోని గుర్తుగా

రాసుకో మనసుపై చెదిరిపోని గుర్తుగా
మిగిలిపో ప్రేమవై ఈ జగతికి వెలుగుగా
స్నేహాల బంధానికి విలువ ఎంతొ ఉందని
స్నేహితులు అంటే ప్రతి అడుగున నీడని
నీ బతుకు తోటలో ఎపుడూ పూచేటి పూలని
నేర్చుకో మరవకు స్నేహితుల విలువనూ
గుండెలో దాచుకో చిన నాటి ప్రేమనూ ॥రాసుకో॥
తుంటరి చేష్టలు ఎన్నో బడిలో చేసినాము
సారులను టీచర్లను ఏడిపించినాము
భుజాన చేతులు వేసి ఎంత తిరిగినాము
ఆటపాటలెన్నొ ఆడి సేద దీరి నాము
అందుకే చేరినాము ఒక్క చోట ఇప్పుడు
భావాలను పంచుకొనగా స్నేహితులం ఇప్పుడు ॥రాసుకో॥
స్నేహితులు రాకుంటే బడి మూగబోయేది
ఎంత చెప్పినా పాఠం అర్థం కాకుండేది
మనసంతా బయటనే స్నేహితుడి ఇంటనే
బడి చుట్టి అయ్యిందా దోస్తుతోనే ఆటనే
ఆ దోస్తీ కోసమే చేరినాము ఇక్కడ
ఆ గురువుల మాటకై వేచి నాము ఇక్కడ ॥రాసుకో॥
ఇన్ని నాళ్ళు దోస్తులారా ఎక్కడున్నరో
మీరు ఎట్లా ఉన్నరో
చిన్ననాటి మన స్నేహం యాది జేస్తిరో
మీరు మరిచిపోతిరో
అమ్మ ఒడి మనబడి ని యాది జేస్తిరో
మీరు మరిచిపోతిరో
అందుకే చేరినాము ఒక్కచోట ఇప్పుడు
గురువుల మాటలను మరిచిపోక ఇప్పుడు ॥రాసుకో॥'
(చిన నాటి స్నేహితులంతా కలిసినప్పుడు)



– సిరిసిల్లా గఫూర్ శిక్షక్,
9849062038

## బుద్ధ పర్కలు

భూమి తల్లిని
ముక్కలు ముక్కలుగా కోసి
అమ్ముకునుడే
రియల్ ఎస్టేట్





-అన్నవరం దేవేందర్
9440763479

